RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: HYDERABAD | సంపుటి: 10 | సంచిక: 172 | ఆదివారం ,12, జనవరి, 2025 | ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ | అసోసియేట్ ఎడిటర్: కే రాజేంద్ర ప్రసాద్ | పేజీలు: 08 వెల: 2 రూ/-

## దారులన్నీ పల్లెలకే..

- సంక్రాంతికి సొంతూళ్లకు పట్నం జనం
- వాహనాలతో కిక్కిరిసిన రోడ్లు
- బారులు తీరిన విజయవాడ రహదారి
- పలుచోట్ల భారీగా ట్రాఫిక్ జామ్
- 32 కిలోమీటర్ల ప్రయాణానికి మూడు గంటలు
- 250కి పైగా ప్రైవేటు బస్సులు, ఇతర వాహనాలపై కేసులు నమోదు



సంక్రాంతి వచ్చిందంటే సందడే సందడి. పండుగ సంబురాలను సొంతూరులో జరుపుకోవడానికి పట్నం వాసులు పల్లె బాట పట్టారు. వరుస సెలవులు రావడంతో ఉద్యోగులు, పిల్లలు అందరూ ఊర్లకు పయనమయ్యారు. బారులు తీరిన బస్సులు.. కిక్కిరిసిన ప్రయాణికులతో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు జనంతో నిండిపోయాయి. మహాత్మాగాంధీ బస్‌స్టేషన్ (ఎంజీబీఎస్), జూబ్లీ బస్‌స్టేషన్(జేబీఎస)లలో అడుగు తీస్తే అడుగుపెట్టలేని పరిస్థితి కనిపిస్తోంది. సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్లు కూడా జనంతో కిక్కిరిసిపోతున్నాయి. ఇక ప్రైవేటు వాహనాలు, సొంత వాహనాల్లో పల్లెలకు పోయే ప్రయాణికులతో నగర శివార్లలోని రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి ప్రాంతాల నుంచి టీజీఎసఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. పండుగ పేరిట ఆర్టీసీ బస్సుల్లో 50% చార్జీలు పెంచడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆయా బస్‌స్టేషన్లకు చేరుకోవడానికి హైదరాబాద్ వాసులు మెట్రో రైళ్లను ఆశ్రయించడంతో.. వాటిల్లోనూ ప్రయాణికుల రద్దీ రోజువారీ కంటే రెట్టింపుగా కనిపిస్తోంది. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే దారుల్లో వాహనాలు పెద్ద ఎత్తున బారులు తీరడంతో అక్కడక్కడ ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. శనివారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-65) కార్లతో కిక్కిరిసింది. నిమిషానికి సగటున 75-80 కార్లు వెళ్లాయి. జాతీయ రహదారిపై ఒక పాయింట్ వద్ద నిల్చొని పరిలించగా.. ఈ కార్ల ప్రవాహం లెక్క తేలింది. హైదరాబాద్-విజయవాడ రహదారిలో ఉన్న పంతంగి, కొర్లపహాడ్, చిల్లకల్లు, కీసర టోల్ ప్లాజాల వద్ద వేలాది వాహనాలు బారులు తీరాయి. ఒక్కోటోల్ ప్లాజాలో సగటున 16 గేట్లు ఉంటే.. వాటిలో 10కి పైగా విజయవాడ రహదారికి వెళ్లే వాహనాలను అనుమతించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ మీదుగా రెండు రోజుల్లో లక్షా 50 వేల వాహనాలు వెళ్లినట్లు టోల్‌గేట్ ఏజెన్సీ నిర్వాహకులు తెలిపారు. ఒక్క శనివారం రోజే 90,000 వాహనాల్లో ఏపీవైపు ప్రజలు వెళ్లారు.

## ‘ఉపకారానికి’ అపకారం

- -మూడేండ్లుగా నిలిచిపోయిన ఎన్టీఎస్ఈ ఎగ్జామ్
- స్కాలర్‌షిప్స్ రాకపోవడంతో పేద విద్యార్థుల గోస
- రూ.40 కోట్లు వెచ్చించడానికీ కేంద్రం మీనమేషాలు
- ‘పరీక్షా పే చర్చా’ కోసం మాత్రం రూ.62 కోట్ల ఖర్చు
- పీఆర్ స్టంట్ల కోసం ఎంతైనా ఖర్చు చేస్తారని విమర్శలు




‘పరీక్షా పే చర్చా’ అంటూ ‘పీఆర్’ స్టంట్‌ల కోసం కోట్లకు కోట్లు ఖర్చు చేస్తున్న కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు.. పేద విద్యార్థుల గోడు మాత్రం పట్టట్లేదు. ప్రతిభ గల విద్యార్థులకు ఉపకార వేతనాల ద్వారా ఆర్థిక చేయూతనందించే ఎన్టీఎస్ఈ ఎగ్జామ్ నిర్వహణకు అవసరమైన నిధులను గడిచిన మూడేండ్లుగా విడుదల చేయకపోవడమే ఇందుకు నిదర్శనం. ఈ మేరకు ఇంగ్లీష్ పత్రిక ‘టెలిగ్రాఫ్’ ఆర్టీఐ పిటిషన్ ద్వారా సేకరించిన వివరాలను బట్టి అర్థమవుతున్నది.

**కరోనా సాకుతో..**

ప్రతిభ గల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలనిచ్చి మరింతగా ప్రోత్సహించే ఉద్దేశంతో 1963లో నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్టీఎస్ఈ)ను ప్రారంభించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణలైన పదోతరగతి, 12వ తరగతి, డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులకు తరగతులను బట్టి నెలకు రూ. 1,250 నుంచి రూ. 37,500 వరకూ ఉపకార వేతనాలను అందిస్తారు. అయితే, కరోనా సంక్షోభాన్ని సాకుగా చూయించిన కేంద్రం 2021లో ఈ పరీక్ష నిర్వహణను నిలిపేసింది. కరోనా సద్దుమణిగిన తర్వాత కూడా పరీక్ష నిర్వహణను పట్టించుకోలేదు. అలా గడిచిన మూడేండ్లుగా ఈ పరీక్ష నిర్వహించకపోవడంతో.. టాలెంట్ ఉన్నప్పటికీ ఎంతోమంది పేద విద్యార్థులు ఉపకార వేతనాలు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఖర్చులను తగ్గించుకోవడానికే కేంద్రం ఈ టాలెంట్ స్కాలర్‌షిప్‌లను నిలిపేసిందని ఆధికారిక వర్గాలను ఉటంకిస్తూ టెలిగ్రాఫ్ తెలిపింది.

**పీఆర్ స్టంట్‌లా..**

పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ధైర్యాన్ని నూరిపోసే ఉద్దేశంతో ప్రారంభించిన పీఎం ‘పరీక్షా పే చర్చా’ కార్యక్రమం ఇప్పుడు ఓ పీఆర్ స్టంట్‌లా మారిందన్న విమర్శలు ఉన్నాయి. కాగా, గడిచిన మూడేండ్లలో ‘పరీక్షా పే చర్చా’ కార్యక్రమానికి ఎంత ఖర్చు చేశారని కేంద్రాన్ని ‘టెలిగ్రాఫ్’ ఓ ఆర్టీఐ పిటిషన్ ద్వారా ప్రశ్నించింది. రూ.62 కోట్లు ఖర్చయినట్టు కేంద్రం సమాధానమిచ్చింది. అయితే, ఎన్టీఎస్ఈ పరీక్ష నిర్వహణ, ఉపకార వేతనాలకు మూడేండ్లలో రూ.40 కోట్ల మేర కూడా ఖర్చయ్యేది కాదని టెలిగ్రాఫ్ ఓ కథనంలో వెల్లడించింది. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడానికి రాని డబ్బులు.. పీఆర్ స్టంట్‌లకు మాత్రం వస్తాయంటూ టెలిగ్రాఫ్ ఆ కథనంలో ఘాటుగా స్పందించింది. విద్యార్థులకు స్కాలర్‌షిప్ ఇవ్వడాన్ని పక్కనబెట్టి ప్రధాని మోదీ పీఆర్ స్టంట్లపై ఎక్కువగా దృష్టిపెడుతున్నారని కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ విమర్శించారు.

**ఏం లాభం??**

‘పరీక్షా పే చర్చా’ అంటూ ప్రధాని మోదీ తమ ప్రచారానికి ఆ కార్యక్రమాన్ని వాడుకోవడం దురదృష్టకరం. ఇదే సమయంలో టాలెంట్ టెస్టును నిలిపేయడం ఆందోళన కలిగిస్తున్నది. ‘ఎగ్జామ్ వారియర్స్’ పేరిట విద్యార్థుల కోసం ప్రధాని మోదీ ఓ పుస్తకాన్ని తీసుకొచ్చారు. అందులో ఉన్న విషయాలనే ప్రతీయేటా ‘పరీక్షా పే చర్చా’లో చర్చిస్తున్నారు. దీంతో అనవసరపు ఖర్చు తప్ప ఒనగూరే లాభమేంటి?



## ఆరోగ్య శ్రీ సేవలు బంద్..

- ఆరోగ్యశ్రీ సేవల్లేవ్!
- సర్కారుకు షాకిచ్చిన ప్రైవేటు ఆస్పతులు
- పెండింగ్ బకాయిలపై స్పష్టత రాలేదని ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తున్నట్లు ఫ్లెక్సీలు

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు సర్కారుకు షాక్ ఇచ్చాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేశాయి. ఎమర్జెన్సీ సేవలను మాత్రం అందిస్తూ మిగిలిన అన్ని రకాల సేవలను అందించలేమని ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. తమ ఆస్పత్రుల ప్రాంగణాల్లో రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశాయి. గత ఏడాది మార్చి నుంచి ఆరోగ్య శ్రీ ట్రస్ట్ నుంచి బకాయులు రావడం లేదని, ఇన్ని రోజులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఆరోగ్య శ్రీ సేవలు అందించినట్లు పేర్కొన్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌కు అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఉపయోగం లేకుండాపోయిందని, అందుకే ఆరోగ్య శ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు యాజమాన్యాలు వెల్లడించాయి. ఈ నెల 10 నుంచి సేవలను నిలిపివేస్తున్నట్లు 4 రోజులు ముందుగానే నెట్‌వర్క్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు మెయిల్ పంపాయి. దాంతో 9న నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధుల బృందంతో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఇవో చర్చలు జరిపారు.

## ‘మాది కిరాయి ఇళ్లు – మా పరిస్థితి ఏంటి సార్’

- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అనర్హులే ఎక్కువ
- ఇందిరమ్మ ఇళ్ల సర్వేలు
- అనర్హుల నుంచే భారీగా దరఖాస్తులు
- సర్వేలో తెలుస్తున్న నిజాలు
- సొంతిళ్లు ఉన్నా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు
- ఆందోళనలో అర్హులు



గతేడాది నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న వారిలో అర్హుల కంటే అనర్హులే ఎక్కువగా ఉన్నట్లు గుర్తించారు. గ్రామాలు, పట్టణాల్లో సొంతిల్లు ఉన్నప్పటికీ లేవని పలువురు దరఖాస్తులు చేసుకున్నట్లు సర్వేలో బయటపడుతోంది. సర్వేయర్లు కొత్త ఇళ్లను మంజూరు చేసేందుకు గత నెల నుంచి దరఖాస్తులు చేసుకున్న వారి దగ్గరకు వెళ్లి పరిశీలించగా సొంతిళ్లు ఉన్నా దరఖాస్తులు చేసుకున్నట్లు గుర్తించారు.

**సొంతిళ్లు ఉన్నా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు :**

నారాయణపేట జిల్లా ధన్వాడలో ఇందిరమ్మ ఇళ్లను శిక్షణ కలెక్టర్ పరిశీలించారు. ఈ పట్టణంలో మొత్తం 3,043 ఇళ్లు ఉన్నాయి. ఇందులో ఆస్తి పన్ను చెల్లించేవి 2,053 మాత్రమే. అంటే 990 ఇళ్లు పడిపోయినవి లేదా పునాదికే పరిమితమైనవే ఉన్నాయని తెలుస్తుంది. అయితే ఇందిరమ్మ ఇళ్లకు మాత్రం 2486 దరఖాస్తులు వచ్చాయి. అంటే కొందరు సొంతిళ్లు ఉన్నా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులు చేశారని తెలుస్తుంది. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి కనిపిస్తుంది. అనర్హులే ఎక్కువగా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలుస్తుంది.

**అనర్హులే ఎక్కువ దరఖాస్తులు :**

నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మూడు మున్సిపాలిటీలు, 11 మండలాల నుంచి మొత్తం 1,48,780 దరఖాస్తులు వచ్చాయి. కానీ ఇక్కడ 1,24,877 కుటుంబాలు, అలాగే 1,38,111 రేషన్ కార్డులు ఉన్నాయి. వీటి కన్నా ఎక్కువ ఇళ్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. కుటుంబాలు, రేషన్ కార్డుల వివరాలు పాతవి, ప్రస్తుత కుటుంబాల సంఖ్య, రేషన్ కార్డుల అర్హులను పరిగణలోకి తీసుకుంటే మరికొంత మంది పెరగవచ్చు.




## మేఘాతో సీఎం చీకటి ఒప్పందం

- సుంకిశాల గోప్యమేల?
- సుంకిశాలపై విజిలెన్స్ రిపోర్ట్‌ను బయటపెట్టకపోవడానికి కారణమిదే
- నిర్మాణలోపం బయటపడ్తదేమోనని సర్కార్ భయం
- నివేదికకు దేశరక్షణతో ముడిపెట్టడం విడ్డూరం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని దుమ్మెత్తిపోసిన రేవంత్‌రెడ్డి.. అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించిండు. మేఘాను తన జేబు సంస్థగా మార్చుకొని ఢిల్లీ పెద్దల ధనదాహాన్ని తీర్చేందుకు పావుగా వాడుకుంటున్నడు. బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి రూ.4,350 కోట్ల కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేక్ కోసినట్టు చెరిసగం పంచిపెట్టి భారీ కుంభకోణానికి తెరతీసిండు.

## మహా కుంభ మేళాకు వేళాయె!

- మహా కుంభమేళా..!
- ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ ఉత్సవం!
- ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మహోత్తర సమ్మేళనం!
- రేపటి నుంచే అతి పెద్ద హిందూ ఉత్సవం
- 144 ఏళ్లకొకసారి వచ్చే ఆధ్యాత్మిక సమ్మేళనం
- 45 రోజులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు
- 40 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా
- ప్రయాగ్‌రాజ్‌లో ఆధ్యాత్మిక శోభ



మహా కుంభమేళా..! ప్రపంచంలోనే అతి పెద్ద హిందూ ఉత్సవం! ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే మహోత్తర సమ్మేళనం! ఆహ్వానం లేకుండానే కోట్లాదిమంది హాజరయ్యే వేడుక! భారతీయ ఆధ్యాత్మికతకు, ఆత్మకు ప్రతిరూపంగా భావించే ‘మహా కుంభమేళా’కు ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ సిద్ధమైంది. సోమవారం నుంచి ఫిబ్రవరి 26 వరకూ 45 రోజులపాటు గంగా, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో మహా కుంభమేళా జరగనుంది. జనవరి 13న పుష్య పౌర్ణమి స్నానంతో ప్రారంభమయ్యే ఈ బృహత్తర క్రతువు ఫిబ్రవరి 26 మహా శివరాత్రి నాడు ముగుస్తుంది. 144 ఏళ్లకు ఒక్కసారి వచ్చే అరుదైన వేడుక కావడంతో యూపీ ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రయాగ్‌రాజ్‌ను యోగి సర్కార్ సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతోంది. పట్టణంలో అడుగు పెట్టిన చోటు నుంచే

## అయోధ్యలో అపురూప ఘట్టం

- ఘనంగా రామమందిరం తొలి వార్షికోత్సవాలు
- ప్రారంభించిన యూపీ సీఎం
- నేడు, రేపూ వేడుకలు.. భారీగా భక్తుల రాక
- దేశ ప్రజలకు మోదీ శుభాకాంక్షలు



భారీగా తరలి వచ్చిన భక్తజనసందోహం మధ్య అయోధ్యలోని రామమందిరం తొలి వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈ వేడుకలను ప్రారంభించారు. బాలరాముడి విగ్రహానికి ఆదిత్యనాథ్ హారతి ఇచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. యజుర్వేద పారాయణంతో వేడుకలు మొదలయ్యాయి. ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరగనున్నాయి. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పూలు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని అలంకరించారు. తొలిరోజు ఆలయ సముదాయంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామ మంత్ర జపంతో పాటు రామ రక్ష స్తోత్రం, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలి వస్తుండటంతో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలను సాధారణ ప్రజలు తిలకించడమే లక్ష్యంగా ఏర్పాట్లు చేశారు.

తెలంగాణ సేన

ఆదివారం ,12, జనవరి, 2025

# దారులన్నీ పల్లెలకే..

బీబీనగర్ మండలం గూడూరు, జోగులాంబ గద్వాల జిల్లాలోని పుల్లూరు, మెదక్ జిల్లా తూప్రాన్ టోల్‌ప్లాజాల వద్దా భారీగా వాహనాల రద్దీ కనిపించింది.

**32 కిలోమీటర్ల ప్రయాణానికి 3 గంటలు**

పెద్దఅంబర్‌పేట నుంచి చౌటుప్పల్ వరకు 32 కిలోమీటర్ల మార్గంలో ప్రయాణానికి మూడు గంటల సమయం పట్టిందని ఓ ప్రయాణికుడు వాపోయారు. అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో వాహనాలు నెమ్మదించాయి. ట్రాఫిక్ సాఫీగా సాగేలా పోలీసులు చర్యలు తీసుకున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు స్వయంగా రంగంలోకి దిగి ట్రాఫిక్ క్రమబద్ధీకరణను పర్యవేక్షించారు. చౌటుప్పల్, సూర్యాపేట పట్టణంలో ఎన్‌హెచ్–65పై ఫ్లైఓవర్లు నిర్మిస్తున్నందున ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. గత ఏడాదితో పోల్చితే ఏపీ వైపు వెళ్లే వాహనాల సంఖ్య 30% పెరిగినట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. వాహనాల రాకపోకలకు ఎటువంటి ఇబ్బంది కలగకుం డా పకడ్బందీ ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. పండుగ సందర్భంగా సికింద్రాబాద్ పరిసరాల నుంచి చర్లపల్లి టెర్మినల్‌కు వెళ్లి వచ్చేందుకు ఆర్టీసీ 146 సిటీ బస్సులను నడుపుతోంది. ఇక పండుగ కోసం రెండు నెలల ముందుగానే రైళ్లలో వెళ్లడానికి రిజర్వేషన్ కోసం ప్రయత్నిస్తే దొరకకపోవడంతో ప్రయాణికులకు అవస్థ లు తప్పడం లేదు. మరోవైపు.. నిబంధనలు ఉల్లంఘి స్తూ తిరుగు తున్న 250కిపైగా ప్రైవేటు బస్సులు, ఇత ర వాహనాలపై కేసులు నమోదు చేసినట్లు రవాణా శాఖ కమిషనర్ సురేంద్ర మోహన్ తెలిపారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు ఇవే..**

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ అంతకంతకూ పెరుగుతుండడంతో పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలంటూ సూచనలు చేశారు. ముఖ్యంగా విజయవాడ, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు ఎన్‌హెచ్–65పై పెద్ద అంబర్‌పేట వద్ద ఓఆర్ఆర్ ఎగ్జిట్–11 నుంచి చౌటుప్పల్, చిట్యాల మీదుగా వెళ్తుంటాయి. రద్దీ నేపథ్యంలో విజయవాడవైపు వెళ్లే వాహనాలు ఔటర్ రింగ్ రోడ్డు ఘట్‌కేసర్ ఎగ్జిట్–9 నుంచి భువనగిరి, వలిగొండ, రామన్నపేట మీదుగా చిట్యాల చేరుకోవాలని, గుంటూరు వైపు వెళ్లే వాహనాలు బొంగుళూరు ఎగ్జిట్–12 నుంచి ఇబ్రహీంపట్నం, మాల్, దేవరకొండ, నాగార్జున్‌సాగర్ మీదుగా గుంటూరు చేరుకోవాలంటూ ప్రత్యామ్నాయ మార్గాలను సూచించారు.

# రైతు భరోసా మార్గదర్శకాలు జారీ

**రైతు భరోసా మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం**

**- భూ భారతిలో నమోదైన సాగుయోగ్యమైన భూములకే రైతు భరోసా**



రైతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రైతు భరోసా పథకం 2025 మార్గ దర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రైతులకు సంబంధించిన అంశంలో పూర్తి స్పష్టత ఉండాలన్న ఉద్దేశంతో తెలుగులో ఉత్తర్వులు జారీ చేసింది. రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించడం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంచడం, ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతో పాటు ఆధునిక పద్ధతులు ఆచరించేందుకు, అవసరం అయిన వనరులను సేకరించడానికి వీలు కల్పించవచ్చని ప్రభుత్వం తెలిపింది.

**భూ భారతిలో నమోదైన సాగుయోగ్యమైన భూములకే రైతు భరోసా :** గ్రామీణాభివృద్ధి, ఆహార భద్రతకు తోడ్పడడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని పేర్కొంది. ఈ నెల 26వ తేదీ నుంచి రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపిన ప్రభుత్వం, పంట పెట్టుబడి సాయాన్ని ఏడాదికి ఎకరాకు రూ.12 వేలు పెంచినట్లు తెలిపింది. భూ భారతి ఇప్పటి వరకు ధరణి పోర్టల్?లో నమోదు అయిన వ్యవసాయ యోగ్యమైన భూ విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సాయం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను రైతు భరోసా నుంచి తొలగించాలని స్పష్టం చేశారు.

**జనవరి 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు :**

అటవీ హక్కుల చట్టం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతు భరోసాకు అర్హులని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే డీబీటీ పద్ధతిలో రైతు భరోసా సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ సంచాలకులు రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తారని, ఐటీ భాగస్వామిగా నేషనల్ ఇన్ ఫర్మేటిక్స్ సెంటర్ వ్యవహరిస్తుందని పేర్కొన్నారు. జనవరి 26 నుంచి ఎకరాకు రూ.12 వేలు రైతు భరోసా పెట్టుబడి సాయం పంపిణీ చేయనున్నారు. జిల్లాల్లో రైతు భరోసా పథకం అమలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు బాధ్యులుగా ఉంటారని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

# ఆరోగ్య శ్రీ సేవలు బంద్

అదేరోజు ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ బిల్లులకు సంబంధించి సుమారు రూ.120 కోట్లు బకాయిలను విడుదల చేసింది. చర్చల సందర్భంలో ఈ నెలాఖరు నాటికి మరో రూ.100 కోట్లు చెల్లించాలని ఆస్పత్రులు డిమాండ్ చేశాయి. సర్కారు మాత్రం ఫిబ్రవరి చివరిలోగా చెల్లిస్తామని తెలిపింది. చర్చల సందర్భంలో నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలు తొలుత సేవలను కొనసాగిస్తామని పేర్కొన్నాయి. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు సమ్మె విరమిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. కానీ కొద్ది గంటల్లోనే నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రభుత్వానికి షాక్ ఇచ్చింది. ఆరోగ్య శ్రీ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ పథకాలకు 10 నెలల నుంచి నిధులు ఇవ్వడం లేదని ప్రకటన విడుదల చేసింది. సర్కారు చెల్లించిన రూ.120 కోట్లు కేవలం నెలన్నర బిల్లులేనని పేర్కొంది. 10 నెలల పెండింగ్ బిల్లులను చెల్లించాలని తెలిపింది. దీనిపై సరైన హామీ లేకపోవడం వల్లనే సేవలను నిలిపివేస్తున్నట్లు నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ అధ్యక్షుడు రాకేశ్‌వెల్లడించారు.

**బాగానే ఇస్తున్నామంటోన్న వైద్యశాఖ**

ఆరోగ్యశ్రీ కింద నెట్‌వర్క్ ఆస్పత్రులకు ఏటా సగటున వెయ్యి కోట్లకు చొప్పున నిధులు వెచ్చించాల్సి ఉండగా.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు 50% చొప్పున కేటాయించింది. 2015లో రూ.444 కోట్లు, 2016లో రూ.609 కోట్లు, 2017లో రూ.524 కోట్లు, 2018లో రూ.596 కోట్లు, 2020లో రూ.557 కోట్లు, 2021లో రూ.783 కోట్లు, 2022లో రూ.631 కోట్లు, 2023లో రూ.515 కోట్లు చెల్లించింది. కాంగ్రెస్ ప్రభుత్వం 2024లో రూ.1130 కోట్లను విడుదల చేసింది. అయితే గతంలో సగం బిల్లులే ఇచ్చినప్పటికీ.. నాటి సర్కారుపై నెట్‌వర్క్ ఆస్పత్రు లు గట్టిగా ఒత్తిడి తీసుకొచ్చిన సందర్భం లేదని వైద్య శాఖ అ?ధికారులు చెబుతున్నారు.

# ఫిబ్రవరిలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

దేశంలోనే అద్భుతమైన ఆర్వోఎస్ 2025 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి తెలిపారు. మేధావులు, అనుభవజ్ఞులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాల మేరకు భూభారతి తీసుకచ్చామన్నారు. దీనిలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా విధివిధానాలు రూపొందించే పనులో అధికారులు నిమగ్నమయ్యారన్నారు. ఈ పక్రియ పూర్తయ్యాక ఫిబ్రవరిలో భూభారతి చట్టాన్ని అమలులోకి తీసుకువస్తామని అన్నారు. శనివారం ఖమ్మంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొందులేటి మాట్లాడారు. గత ప్రభుత్వం మాదిరిగా తప్పులు జరగకుండా సమర్థమైన, రైతులకు మేలుచేకూర్చే కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ భూముల కబ్జాపై భూభారతి ద్వారా ఫిర్యాదు చేసే అవకాశముందని మంత్రి అన్నారు.

**పార్ములా ఈ రేస్ :** పార్ములా ఈ రేస్ కేసు వ్యవహారంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని మంత్రి పొంగులేటి అన్నారు.




కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కయ్యాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ అంటున్నారని అలా అనుకుంటే కేంద్రమే అరెస్ట్ చేయచ్చు కదా అని ప్రశ్నించారు. దీని విషయంలో ఏసీబీ విచారణ చేపట్టిన తర్వాత చర్యలు తీసుకుంటుందన్నారు. కర్ణాటకలో అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తూ భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేస్తామని తెలిపారు.

# మేఘాతో సీఎం చీకటి ఒప్పందం

సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనపై విజిలెన్స్ రిపోర్టును బయటపెట్టకపోవడానికి మేఘా కృష్ణారెడ్డితో సీఎం రేవంత్‌రెడ్డి చేసుకున్న చీకటి ఒప్పందమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఒక నిర్మాణ సంస్థ ఘోర తప్పిదాన్ని దేశ రక్షణకు ముడిపెట్టి దాయడం విడ్డూరంగా ఉన్నదని శనివారం ఎక్స్ వేదికగా అసహనం వ్యక్తం చేశారు. సుంకిశాల ఘటనపై విజిలెన్స్ నివేదికను సమాచార హకు చట్టం కింద ఇవ్వకుండా తొకిపెట్టడం దారుణమని ఆగ్రహం వ్యక్తంచేశారు. మేఘా సంస్థను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలనే కమిటీ రిపోర్ట్‌ను ప్రభుత్వం రహస్యంగా ఉంచడంలో కారణమేమిటని ప్రశ్నించారు. మేఘా సంస్థ నిర్లక్ష్యం వల్ల రిటైనింగ్ వాల్ కూలి రూ.80 కోట్ల ప్రజాధనానికి నష్టం వాటిల్లిందని, హైదరాబాద్‌లో పెరుగుతున్న తాగునీటి అవసరాలను తీర్చే సంకల్పానికి గండిపడిందని ఆవేదన వ్యక్తంచేశారు.

నిర్మాణ లోపం బయట పడుతుందనే భయంతోనే కమిటీ నివేదికను బహిర్గతం చేయడానికి కాంగ్రెస్ సరారు జంకుతున్నదని మండిపడ్డారు. సమాచారాన్ని దాయడమంటే తప్పును ఒప్పుకొన్నట్టేనని స్పష్టంచేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మేఘా సంస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ అని దుమ్మెత్తిపోసిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే ప్లేటు ఫిరాయించారని ఎద్దేవాచేశారు. తన జేబు సంస్థగా మార్చుకొని ఢిల్లీ పెద్దల ధనదాహాన్ని తీర్చేందుకు పావుగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు.

బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన మేఘా సంస్థకు, మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కంపెనీకి రూ.4,350 కోట్ల కొండగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కేక్ కోసినట్టు చెరిసగం పంచిపెట్టి భారీ కుంభకోణానికి తెరతీశారని విమర్శించారు. ఇప్పటికైనా సమాచార హకు చట్టాన్ని నిర్వీర్యం చేసే చర్యలను మానుకోవాలని, సుంకిశాల ఘటనపై ప్రభుత్వం చేపట్టిన విచారణ నివేదికను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.

# 'మాది కిరాయి ఇళ్లు – మా పరిస్థితి ఏంటి సార్'

సొంత ఇళ్లు ఉన్నావారు కూడా దరఖాస్తు చేసుకున్నట్లు సర్వేయర్లు గుర్తించారు. పలు చోట్ల భవనాల ఫోటోలు తీసేందుకు దరఖాస్తులు నిరాకరించడంతో ఎలాగో సర్దిచెప్పి 3 రకాల ఫోటోలు తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. మరికొంత మంది అద్దె ఇళ్లు అని లేదా అన్నదమ్ములకు సంబంధించిందని చెబుతూ ఫోటోలు దిగారు.

**ఆందోళనలో అర్హులు :**

అనర్హులు పెద్ద ఎత్తున దరఖాస్తులు చేసుకోవడంతో అర్హులు ఆందోళన చెందుతున్నారు. కొందరు అధికార పార్టీ నాయకశ్రేుల చుట్టూ తిరుగుతూ దరఖాస్తు విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మొదట ఇల్లు లేనివారికే ప్రాధాన్యం ఇస్తామని చెబుతుండటంలతో వీరికి కొంత ఉపశమనం లభిస్తోంది. జూ

# మహా కుంభ మేళాకు వేళాయె!

ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. దాదాపు ప్రతి కూడలిలో గజ్జెలు, ఢమరుకం వంటి చిహ్నాలను ఉంచింది. గోడలకు పెయింటింగులు వేయించింది! విద్యుత్తు, ఇతర స్తంభాలకు త్రినేత్రం తదితర సొబగులను అద్దింది. నెలన్నరపాటు పుణ్య స్నానాలు ఆచరించేందుకు దాదాపు 40 కోట్ల మంది భక్తులు, యాత్రికులు వస్తారని యూపీ సర్కారు అంచనా వేస్తోంది. త్రివేణి సంగమానికి ఇరువైపులా దాదాపు 4 వేల హెక్టార్లలో సౌకర్యాలు కల్పిస్తోంది.

**ఏఐ టెక్నాలజీ సాయంతో నిఘా**

కోట్లాదిమంది భక్తులు హాజరయ్యే మహా కుంభమేళా కోసం ప్రభుత్వం అంతే స్థాయిలో భద్రతా చర్యలు చేపట్టింది. ఇప్పటికే సమగ్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. 2,750 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. అత్యంత కీలక, సమస్యాత్మక ప్రాంతాల్లో ఏఐ ఆధారిత కెమెరాలను బిగిస్తోంది. భక్తులకు సమాచారాన్ని అందించడానికి 80 వీఎండీ టీవీ స్క్రీన్లను ఏర్పాటు చేస్తోంది. '1920' పేరిట హెల్ప్‌లైన్‌తోపాటు 50 మందితో కాల్ సెంటర్‌నూ ఏర్పాటు చేస్తోంది. వేలాది సంఖ్యలో భద్రతా సిబ్బందిని మోహరించనుంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠమైన నిఘా కోసం డ్రోన్లు, ఏఐ సాయంతో కెమెరాలను వినియోగించనుంది. నీటిలోనూ నిఘా ఉంచే డ్రోన్లు అందుబాటులో ఉంచుతోంది. సైబర్ మోసాలకు తావు లేకుండా 56 మంది సైబర్ సెక్యూరిటీ నిపుణులను రంగంలోకి దించుతోంది.

కుంభమేళాలు నాలుగు..

హిందూ పురాణాల ప్రకారం.. దేవతలు, రాక్షసులు పాల సముద్రాన్ని మథిస్తారు. అప్పుడు ఒక కుండ (కుంభం)లో అమృతం బయటకు వస్తుంది. దానిని రాక్షసులకు అందకుండా చేయడం కోసం మోహినీ రూపం ధరించిన విష్ణువు ఆ కుండను తీసుకుని వెళుతూ ఉంటాడు. ఆ సమయంలోనే నాలుగు అమృతం చుక్కలు నేలపై పడతాయి. ఆ నాలుగు ప్రాంతాలే ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని, నాసిక్. అందుకే, వాటిని పవిత్ర పుణ్య క్షేత్రాలుగా భావిస్తూ కుంభమేళాలు నిర్వహిస్తారు. వీటిలో ఒక్కో కుంభమేళాను ఒక్కో చోట నిర్వహిస్తారు. మాఘ మేళాను ఏటా మాఘ మాసంలో ప్రయాగ్‌రాజ్‌లోబీ అర్ధ కుంభ మేళాను ప్రతి ఆరేళ్లకు ఒకసారి హరిద్వార్, ప్రయాగ్‌రాజ్‌ల్లో నిర్వహిస్తారు. పూర్ణ కుంభమేళాను ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి మొత్తం నాలుగు క్షేత్రాల్లోనూ అట్టహాసంగా నిర్వహిస్తారు. మహా కుంభ మేళా మాత్రం 144 ఏళ్లకు ఒకసారి వస్తుంది. దీనిని ఒక్క ప్రయాగ్‌రాజ్‌లోనే నిర్వహిస్తారు.

**ఏం చేస్తారంటే..**

త్రివేణీ సంగమంలో స్నానం చేసి అక్కడే ఉన్న మాధవుడిని దర్శించుకుని, అక్షయ్ వట్ (మర్రిచెట్టు)ను దర్శించుకోవడాన్ని మహా కుంభమేళాలో భాగంగా భావిస్తారు. ఆ తర్వాత బడే హనుమాన్ ఆలయాన్ని సందర్శిస్తారు. దీపంతోపాటు ఇతర దానాలు చేయడాన్ని పవిత్రంగా భావిస్తారు. సంకీర్తనలు, భజనలు, యోగా, మెడిటేషన్‌కు ప్రాధాన్యం ఇస్తారు. తొలుత, నాగ సాధువులు వచ్చి పుణ్య స్నానాలు చేయడాన్ని కుంభమేళాకు ఆరంభంగా భావిస్తారు. ఆ తర్వాత అఖాడాలకు నిర్దిష్ట సమయం కేటాయిస్తారు. ఆ తర్వాతే సామాన్య భక్తులు స్నానాలు చేయడానికి అనుమతిస్తారు.

**పుణ్య స్నానాలకు ముఖ్యమైన రోజులు**

నెలన్నరపాటు జరిగే మహా కుంభమేళా సమయంలో గంగా, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో స్నానం చేస్తే పాపాలు తొలగిపోయి మోక్షం లభిస్తుందని హిందువులు విశ్వసిస్తారు. 'షాహీస్నాన్'గా పిలిచే పుణ్య స్నానాన్ని ఆచరించడం ద్వారా ఆత్మ శుద్ధి అవుతుందని, పాపాల నుంచి విముక్తి చెందుతామని నమ్ముతారు.

# లివ్–ఇన్ పార్టనర్ హత్య!

**-10 నెలలుగా ఫ్రిడ్జ్?లో మహిళ మృతదేహం**

[illegible]



ఈ ఘటనకు సంబంధించి నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, అతడిని ప్రశ్నించారు. ప్రాథమిక విచారణలో నిందితుడు నేరం అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది.

**ఇలా వెలుగులోకి!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం– బీఎన్?పీ(బ్యాంక్? నోట్ ప్రెస్) పోలీస్? స్టేషన్? పరిధిలోని బృందావన్ కాలనీలో ఉన్న ఓ ఇంట్లోని ఫ్రిడ్జ్?లో మహిళ మృతదేహం లభించింది. ఆ ఇంటి యజమాని ధీరేంద్ర శ్రీవాస్తవ్. అతడు ప్రస్తుతం ఇండౌర్? నివాసం ఉంటున్నాడు. ఘటన జరిగిన ఇంటిని ఇటీవల బల్?బీర్? రాజ్?పుత్? అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చాడు. అయితే, చాలా కాలంగా ఇంటికి తాళం వేసి ఉంది. ఈ క్రమంలో ఇంటిని శుభ్రం చేద్దామని బల్?బీర్ శుక్రవారం తాళం తీశాడు. క్లీన్? చేస్తున్న క్రమంలో ఫ్రిడ్జ్? ఓపెన్ చేశాడు. అందులో మహిళ మృతదేహం కుక్కి కనిపించింది. వెంటనే బల్?బీర్? పోలీసులకు సమాచారం అందించాడు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. ఆ ఇంటి చుట్టుపక్కల నివసించే వారిని విచారించారు. ఈ క్రమంలో బల్?బీర్? రాజ్?పుత్? కంటే ముందు ఆ ఇంట్లో ఉజ్జయినికి చెందిన సంజయ్? పటిదార్ అనే వ్యక్తి ఉండేవాడని వారు చెప్పారు. అతడితో పాటు ప్రతిభ అలియాస్ పింకీ ప్రజాపతి అనే మహిళ ఉండేదని పోలీసులకు తెలిపారు. అయితే బాధితురాలు 2024 మార్చి నుంచి కనిపించడం లేదని, ఇదే విషయం సంజయ్?ను అడిగితే పింకీ తన తల్లి ఇంటికి వెళ్లిందని చెప్పాడని పేర్కొన్నారు.

**'అందుకే చంపేశా'**

ప్రాథమిక వివరాలు సేకరించిన పోలీసులు నిందితుడు సంజయ్?ను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి సంజయ్?ను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీసు వారి శైలిలో విచారిస్తే, నిందితుడు నేరం అంగీకరించాడు. హత్యకు ముందు ఐదేళ్లుగా ప్రతిభతో లివ్? ఇన్? లిషేషన్? షిప్?లో ఉన్నానని చెప్పాడు. ఆమె తరచూ పెళ్లి చేసుకోమని ఒత్తిడి తేవడం వల్ల, వినోద్? దవే అనే వ్యక్తి సాయంతో చంపేశానని చెప్పాడు.

నేరాన్ని కప్పిపుచ్చడానికి నిందితులు మృతదేహాన్న ఫ్రిడ్జ్?లో కుక్కారని పోలీసులు తెలిపారు. ఫ్రిడ్జ్?ను వస్త్రంతో గట్టిగా కట్టి, ఇంటికి తాళం వేసినట్లు వెల్లడించారు. నిందితుడు, తన లివ్? ఇన్ పార్ట్‌నర్? ప్రతిభతో ఉజ్జయినిలో మూడేళ్లు ఉన్నాడని, అనంతరం బృందావన్ కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకున్నాడని చెప్పారు.

**ఫ్రిడ్జ్? నుంచి దుర్వాసన**

ప్రస్తుతం ఆ ఇంటిని అద్దెకు తీసుకున్న బల్?బీర్, ఇంటి తాళం తీయమని యజమానిని అడిగాడు. ఇల్లు తాళం తీసి యజమాని బల్?బీర్?కు పోర్షన్ చూపించి మళ్లీ 2025 జనవరి 8న తాళం వేశాడు. కరెంట్ సప్లై కూడా ఆపేశాడు. దీంతో ఫ్రిడ్జ్? పనిచేయడం ఆగిపోయింది. అనంతరం ఫ్రిడ్జ్? నుంచి దుర్వాసన రావడం మొదలుపెట్టింది.

ఈ హత్యకు సంబంధించిన మరో నిందితుడు వినోద్?, ఓ కేసులో ప్రస్తుతం రాజస్థాన్?లోని జైలులో ఉన్నాడని పోలీసులు చెప్పారు. ఈ హత్య కేసుకు సంబంధించి రాజస్థాన్? పోలీసులతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

# సంపాదకీయం

## నైపుణ్య యువతే రేపటి భవిత!

దేశ ఘన చరిత్రను మార్చి రాయగలిగేది విద్యావేత్తలు మాత్రమే. దేశ, ప్రపంచ దశ దిశలకు మార్చగలిగే సామర్థ్యం విద్యావేత్తలతో ఉంటుంది. రేపటి సమాజ స్థితిగతులను నిర్ణయించే శక్తియుక్తులు నేటి విద్యావేత్తలు, శాస్త్రజ్ఞులకు మాత్రమే ఉంటుందని గత చరిత్ర ఏకరువు పెడుతున్నది. ప్రతి విద్యావంతుడు ఓ మహత్తర శక్తి అవుతాడు. మేధావి ఒక వ్యాప్తి కాదు, మేధో వ్యవస్థ. సమాజ గతిని మార్చగలిగే ధీరుడు విద్యావేత్త. విద్య లేని వాడు వింత పశువు అన్నారు పెద్దలు. కత్తి కన్న కలం గొప్పది దిగని కూజా విన్నాం. దేశాభివృద్ధిని విద్యావంతుల సంఖ్యతో ప్రమాణీకరించడం పరిపాటి అయ్యింది. వ్యక్తి, కుటుంబ, దేశ ప్రగతికి బాటలు వేయగలిగేది విద్య మాత్రమే. విద్యతో వివేకం తోడైతే ప్రపంచం మనకు సలాం కొడుతుంది. బుద్ధిలేని నిరక్షరాస్యుడి కన్న అనైతిక విద్యావంతుడు అతి ప్రమాదకరం. స్వతంత్ర భారత దేశంలో అత్యంత ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఏఐసిటీఈ, ఐఐఎస్సి యూజిసి, వయోజన విద్య లాంటివి నెలకొల్పి దేశ యువతను అంతర్జాతీయ స్థాయిలో రాణించడానికి చక్కటి మార్గాన్ని వేశారు. ఒక బాలిక లేదా యువతి ఒక తరగతి ఎక్కువగా చదివితే ఆవిడ భవిష్యత్తు ఆదాయం 20 శాతం వరకు పెరుగుతుందని పేర్కొనబడింది. మహిళ/బాలికల నిర్బంధ ఉచిత విద్యకు పెద్ద పీట వేసిన నాయకుల దార్శనికత కొనియాడదగింది. చదువు, నైపుణ్యాల ద్వారానే దేశ సంస్కృతి వారసత్వాలు వెలుగొందుతాయి నమ్మిన మేధావులు మనదేశంలో అనేకులు ఉన్నారు. విద్య ప్రయోజనాలలో వ్యక్తిత్వం వికాసం, ఆకర్షణీయ ఉద్యోగం, సమాజాన్ని జాగృత పరచడం, పేదరికాణి తరివేయడం, అసమానతలను తొలగించడం, నాణ్యమైన జీవితాన్ని గడపడం, మానవీయ విలువలను జీర్ణించుకోవడం, సమాజంలో గౌరవాన్ని పొందడం, కుటుంబ అభివృద్ధికి దోహదపడడం, చక్కటి జీవనశైలిని పాటించడం, ఆలోచనల్లో విస్తృతి కలగడం, సంభాషనాచాతుర్యం, నాయకత్వ లక్షణాలు అలవడడం, శారీరక మానసిక సమతుల్యత సాధించడం, సన్మార్గంలో నడుస్తూ ప్రజలకు దిశ నిర్దేశనం చేయడం, సద్గుణాలను ఆకలింపు చేసుకోవడం, నైపుణ్యాలను వంటపట్టించుకోవడం, సరైన ప్రశ్నలకు ధీటైన సమాధానాలు ఇవ్వగలగడం, తార్కిక విశ్లేషణలు చేయగలగడం, ఆర్థిక ప్రగతి, సామాజిక చైతన్యం, సాంకేతిక విప్లవం, దేశాభివృద్ధిని కాంక్షించడం లాంటివి అనేకం ఉన్నాయి.

విద్యార్థి కేంద్రిత విద్య లేదా స్టూడెంట్ సెంట్రిక్ ఎడ్యుకేషన్ ప్రాధాన్యతను ప్రచారం చేయడం, సృజనశీలతను ఆహ్వానించడం, విలక్షణ ఆలోచనలకు ఊతం ఇవ్వడం, సమ్మిళిత విద్యా విధానానికి పునాదులు వేయడం, నైపుణ్యాల పెంపుకు పట్టం కట్టడం, వ్యక్తిని మహత్తర శక్తిగా మార్చగలగడం నేటి విద్యా విధానానికి ఊపిరి కావాలి. విషయ పరిజ్ఞానానికి నైపుణ్యం తోడైతేనే వ్యక్తి ప్రతిభ దేశానికి దోహదపడుతుంది. నైపుణ్యం లేని విద్య సువాసన లేని పువ్వులాంటిదే అని గమనించి నేటి యువత విద్య, నైపుణ్యాలను సమాంతరంగా ఒట్టపట్టించుకోవాలి. జాతీయ విద్యా దినోత్సవ వేదికగా విద్య ప్రాధాన్యాన్ని వివరించే సదస్సులు/కార్యశాలలు, కమ్యూనిటీ కార్యక్రమాలు, రీడింగ్ హాబిట్‌ను పెంచడం, విద్యావేత్తలను గుర్తించడం, విద్యలో రాణించిన యువతను సన్మానించడం, విద్యార్థులకు విద్య ప్రాధాన్య అంశాల్లో పోటీలు నిర్వహించడం లాంటి పలు కార్యక్రమాలు నిర్వహించవచ్చు.

నేటి ఆధునిక డిజిటల్ ఏఐ యుగంలో భారత ప్రభుత్వం విద్యా ప్రాధాన్యాన్ని గుర్తించి సర్వశిక్షా అభియాన్, డిజిటల్ ఇండియా ఇనిషియేటివ్, నూతన విద్యా విధానం-2000 లాంటి పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. నేడు భారత్‌లో అక్షరాస్యత రేడు 77.7 శాతం మాత్రమే ఉన్నది. మన దేశంలో అక్షరాస్యత రేటు కేరళలో అత్యధికంగా 96.9 శాతం, అత్యల్పంగా బీహార్‌లో 61.8 శాతం నమోదు అవుతున్నది. తెలంగాణలో 72.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 66.8 శాతం అక్షరాస్యత రేటు నమోదైంది. గ్రామీణ భారతంలో 73.5 శాతం, పట్టణ ప్రాంతాల్లో 87.7 శాతం అక్షరాస్యత నమోదు అవుతుండగా, పురుషుల్లో 84.7 శాతం, మహిళల్లో 70.3 శాతం నమోదు అవుతున్నది. ప్రపంచంలో 3వ అతి పెద్ద విద్యా వ్యవస్థ కలిగిన భారతంలో 56 కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, 459 రాష్ట్ర యూనివర్సిటీలు, 126 డీమ్డ్ యూనివర్సిటీలు, 430 ప్రైవేట్ యూనివర్సిటీలు, 1.5 మిలియన్ల పాఠశాలలు ఉన్నాయి. పాఠశాల విద్యను 260 మిలియన్లు అభ్యసిస్తున్నారు. భారత ఉన్నత విద్యలో స్థూల నమోదు నిష్పత్తి 28.4 శాతంగా నమోదు అవుతున్నది. ప్రతి లక్ష జనాభాకు బీహార్‌లో 7 కళాశాలలు, తెలంగాణలో 59 కళాశాలలు ఉండగా దేశంలో సగటున 28 కళాశాలలు ఉన్నాయి. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి అమెరికాలో 13:1, చైనాలో 20:1 ఉండగా భారత్‌లో మాత్రం 30:1గా ఉన్నది. దేశంలో 30 శాతం కళాశాలలు మాత్రమే గుర్తింపు పొందగా, 45 శాతం యూనివర్సిటీలు మాత్రమే గ్రేడ్స్ పొందాయి. ప్రపంచ అత్యుత్తమ 1000 యూనివర్సిటీల్లో భారత్‌కు చెందిన 91 యూనివర్సిటీలు మాత్రమే ఉండడం విచారకరం. భారత్‌లో విద్యా వ్యవస్థ కొంత వరకు గాడి తప్పినట్లు, నాణ్యతలకు తిలోదకాలిస్తూ, నైపుణ్య విద్యను గంగలో కలుపుతూ యువభారతం నిరుద్యోగంతో అసహనాన్ని వ్యక్తం చేస్తున్నది. గుణాత్మక విద్యను త్యాగం చేస్తూ పరిమాణాత్మక మెరుపులకే మురిసి పోతున్న భారతీయ విద్యా వ్యవస్థను పట్టాలపైకి తీసుకురావలసిన సమయం ఆసన్నమైంది. యువ భారతానికి డిజిటల్ మెరుగులు దిద్ది, నైపుణ్య బుద్ధులు నేర్పి అంతర్జాతీయ స్థాయి టెక్నోక్రేట్స్, సైంటిస్టులు, అధ్యాపకులు, పలురంగాల్లో శాసించగల మేధావులను తయారు చేసే నూతన గుణాత్మక విద్య విధానం కావాలని, ప్రభుత్వాలు ఆ దిశలో పటిష్ట అడుగులు వేయాలని కోరుకుందాం. అందరికీ జాతీయ విద్యా దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

# తొలి ఎలక్ట్రానిక్ మాస్ మాధ్యమం రేడియో

రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసినప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు “మార్కోనీ” కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది.మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే.వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం



150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా SOS సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది.1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు.1908 జనవరి 22న చాలా దూర ప్రాంతాలకు రేడియో సందేశాలను ఈఫిల్ టవర్ నుండి మొట్టమొదటిసారి ప్రసారం చేశారు.మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి.1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు.1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది.

బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది.ఆకాశవాణి ప్రపంచం లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ అధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే.



రామ కిష్టయ్య సంగన భట్ల...

దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరు కుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగు తున్నాయి.

# కార్చిచ్చు మానవ తప్పిదమా?



డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

నూతన సంవత్సర వేడుకలతో పాటు క్రిస్మస్ పర్వదినాలను ఘనంగా జరుపుకొని సేదదీరుతున్న వేళ జనవరి 07, 2025 రోజున ప్రారంభమైన ‘అణుబాంబు విస్ఫోటనం’ లాంటి కార్చిచ్చు లేదా వైల్డ్‌ఫైర్ ఇప్పటికే ఐదు ప్రాంతాలను ఆక్రమించడం, 1.8 లక్షలకు పైగా ప్రజలను సురక్షిత స్థానాలకు లేదా శిబిరాలకు తరలించడం, మరో 2 లక్షల ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి హెచ్చరికలు జారీ చేయడం, ఇప్పటికే కనీసం ఆరుగురు అగ్నికి ఆహుతి కావడం, లెక్కకు మించి గాయాలపాలు కావడం, వేల ఇండ్లు కాలి బూడిద కావడం, అనేక లక్షల ఇండ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోవడం, అత్యంత సంపన్నుల అద్దాల మేడలు సహితం మంటల్లో కుప్పకూలడం, వేగంగా విస్తరిస్తున్న కార్చిచ్చు నేటికీ అదుపులోకి రాకపోవడంతో అమెరికాతో పాటు ప్రపంచ మానవాళి తమ సంతాపాలను, సహానుభూతులను ప్రకటించడం జరుగుతోంది. తొలుత ‘పాలిసేడ్స్’ ప్రాంతంలో మొదలైన చిన్న కార్చిచ్చు నేడు దాదాపు 18,000 ఎకరాలకు విస్తరించడంతో ఆస్తి, ప్రాణ నష్టాలు అధికంగా నమోదు అవుతున్నాయి. ‘ఈటన్’ ప్రాంత కార్చిచ్చులు 13,000 ఎకరాలకు, ‘హర్స్ట్’ ప్రాంత కార్చిచ్చులు 700 ఎకరాలకు, ‘లిడియా’ ప్రాంత కార్చిచ్చులు దాదాపు 500 ఎకరాలకు, ‘కెన్నెత్’ ప్రాంత కార్చిచ్చులు 800 ఎకరాలకు, ‘సన్‌సెట్’ ప్రాంత కార్చిచ్చులు 60 ఎకరాలకు విస్తరించి అదుపు చేయలేని నిస్సహాయ స్థితికి అమెరికన్ యంత్రాంగం చేరింది. కాలిఫోర్నియా ప్రాంతంలో కార్చిచ్చులు తరుచుగా ఎగిసిపడడానికి సహజ ప్రకృతి ప్రకోపంతో పాటు మానవ తప్పిదాలు కూడా కారణం అవుతున్నాయి. ప్రతికూల వాతావరణ మార్పులతో సగటు ఉష్ణోగ్రతలు పెరగడం, భూ ఉపరితలం పూర్తిగా ఎండలకు ఎండుతూ పొడిబారడం జరుగుతోంది. 2023-24 ఏడాది అత్యంత వేడి కలిగిన వడ గాలులను చవిచూసాయి. అటు తీవ్రమైన వడగాలులు, ఇటు పచ్చదనం ఎండిపోయి పొడిబారడంతో అగ్నికి ఆజ్యం పోసినట్లు కార్చిచ్చు వేగంగా ఇతర ప్రాంతాలకు విస్తరిస్తూ, అగ్నిమాపక సిబ్బంది ప్రయత్నాలకు సహితం లొంగడం లేదు. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా కార్చిచ్చులు గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న వడగాలులు తోడవడం, అడవుల్లో ఎండిపోయిన వృక్ష సంపదకు మంటలు సులభంగా వ్యాప్తి చెందడానికి ఊతం ఇవ్వడం, కరువుకాటకాలు వెంటాడడం, గాలిలో తేమ తగ్గడం, వర్షపాతం సగటు కన్న చాలా తక్కువగా నమోదు కావడం, ఉష్ణోగ్రతలు అతిగా రికార్డు కావడం, అటవీ ప్రాంతాలకు దగ్గరగా అర్బన్ కాలనీలు నిర్మింపబడడం (వైల్డ్‌ల్యాండ్-అర్బన్ ఇంచర్‌ఫేజ్) లాంటి పలు కారణాలతో నేటి కార్చిచ్చు ప్రభావంతో తీవ్రమైన నష్టం వాటిల్లుతున్నది. సాధారణంగా మే-అక్టోబర్ వరకు కనిపించే కార్చిచ్చులు నేడు ఏడాది కాలం పాటు కనిపించడం రాబోయే ప్రమాదానికి హెచ్చరికగా తీసుకోవాలి. ఈ సీజన్లో తక్కువగా కనిపించే కార్చిచ్చులు నేడు తీవ్ర స్థాయిలో ఎగిసి పడడంతో అమెరికన్లు సహితం ఆశ్చర్యపోతూ, నిస్సహాయంగా చూస్తూ నిలబడవలసి వస్తున్నది. 2020-21లో నమోదైన కార్చిచ్చుల ఫలితంగా ఇప్పటికే దాదాపు 7 లక్షల హెక్టార్ల ప్రాంతం కాలి బూడిదగా మారిపోతూ బిలియన్ డాలర్ల ఆస్తి నష్టమై కాకుండా ప్రాణ నష్టం కూడా చవి చూడడం గమనించారు. కార్చిచ్చుల ప్రభావం కాలిఫోర్నియా ప్రాంతానికే పరిమితం కాలేదని గమనించాలి. ప్రపంచవ్యాప్తంగా పలు సందర్భాల్లో అనేక దట్టమైన కారడవులు అడవులు అగ్నికి ఆహుతి కావడం చూసాం. వాతావరణ మార్పులతో ప్రతి ఏడాది సగటు ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, వర్షపాతం తగ్గడం, వడగాలులు వీచడం, గాలిలో తేమలు తగ్గడం లాంటి పలు కారణాలతో రోజు రోజుకు ప్రపంచ దేశాలు కార్చిచ్చుల రూపంలో అగ్ని ప్రమాదాలకు దగ్గర అవుతున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. వాతావరణ ఉష్ణోగ్రతలు పెరిగిన కొద్దీ కార్చిచ్చుల ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి. నేడు అభివృద్ధి పేరుతో అభివృద్ధి చెందిన దేశాలు విడుదల చేస్తున్న విచక్షణారహిత కార్బన్ ఉద్గారాలతో వాతావరణ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగడం, కార్చిచ్చులను ఉసిగొల్పడం కొనసాగుతున్నది. ఎవరు తీసిన గోతిలో వారే పడుతున్నారు.

# యుగ పురుషుడు వివేకానందుడు

భారతదేశ సంస్కృతిని, ఆద్యాత్మిక చింతనను, విదేశాలకు చాటి చెప్పి న మహోన్నత వ్యక్తి స్వామి వివేకా నంద. ఉపన్యాసాల ద్వారా భారత యోగ, వేదాంత శాస్త్రాలను ఖండాం తరాలు దాటించిన వ్యక్తి ఆయన. అమెరికాలోని చికాగోలో, ఇంగ్లాండులో ఆనాడు చేసిన ఆయన ప్రసంగాలను భారత సమా జం గర్వంగా గొప్పగా నేటికీ గుర్తు చేసుకుంటునే ఉంటుంది. పాశ్చాత్య దేశాల్లో అడుగు పెట్టిన తొలి హిందూ సన్యాసి కూడా వివేకానందనే కావడం విశేషం. ఇనుప కండరాలు, ఉక్కు నరాలు, వజ్ర సంకల్పం ఉన్న యువత ఈ దేశానికి అవసరం’...‘లేవండి..మేల్కోండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి’ వంటి వివేకానంద సూక్తులు ఇప్పటికీ ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన వివేకానందుని వ్యక్తిత్వాన్ని ఆయన జయంతి సందర్భంగా భారతీయులు ఏటా స్మరించు కుంటున్నారు. ఆయన సేవలను స్మరిస్తూ భారత ప్రభుత్వం వివేకా నంద జన్మదినాన్ని ‘జాతీయ యువజన దినోత్సవం’గా జరుపు తోంది. స్వామి వివేకానంద 1863 సంవత్సరం జనవరి 12 తేదీన మకర సంక్రాతి రోజున ఒక బెంగాలీ కుటుంబంలో కలకత్తాలో జన్మించా రు. జులై 4, 1902న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. చిన్న వయసులోనే ఎన్నో పాశ్చాత్య , తత్వ శాస్త్ర గ్రంధాలు, నవలలు, చరిత్రలు, అన్ని మతాల గ్రంధాలు, ఇలా ఎన్నో చదివే వారు. జీవించింది కేవలం 39 సంవత్సరాలే కానీ శతాబ్దాల పాటు చెరిగిపోని ముద్ర వేశారు. తూర్పు మరియు పశ్చిమ సంస్కృ తుల మధ్య ఒక వారధి నిర్మిం చారు. మన దేశానికి ప్రపంచ దేశాల్లో గౌరవం తెచ్చిన గొప్ప వ్యక్తి. ఆయన జీవితం మొత్తం మీద తన కంటూ చేసుకున్నది, దాచుకున్నది ఏది లేదు. ఆయన విదేశాలలో ఎలాంటి ముద్ర వేశారంటే ఇప్పటికి అమెరికాలో ఒక వీధికి “స్వామి వివేకానంద స్ట్రీట్” అని పేరు పెట్టు కున్నారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతున్నది.

మహాత్మా గాంధీ , సుభాష్ చంద్రబోస్, లోకమాన్య తిలక్, బిపిన్ చంద్ర పాల్ వంటి ఎంతో మంది స్వాతంత్ర యోధులకు



వివేకానందుడే ఆదర్శం. . “మీరు ఇండియా గురించి తెలుసు కోవా లను కుంటే స్వామి వివేకానంద గురించి చదవండి” అన్నారు విశ్వకవి టాగోర్.ముఖ్యంగా యువతకోసం ఆయన ఎంతో తపించారు. రామకృష్ణ మఠాన్ని స్థాపించి తద్వారా భారతీయ యువతకు దిశా నిర్దేశం చేశారు. భారతదేశ భవిష్యత్తుని మార్చగలిగేది యువతేనని, యువత ఒక మంచి ఆశయంతో ముందుకు వెళ్లాలని ఆయన అనే వారు. అందుకే “డబ్బు లేని వాడు కాదు..

. జీవితంలో ఒక ఆశయం అంటూ లేని వాడు అసలైన పేద వాడు” అనే వారు వివేకానంద. ఆయన ఎప్పుడు కూడా “గొర్రెలలా కాదు సింహంలా ధైరంగా బ్రతక మని” దేనికి భయపడవద్దని చెపుతుండే వారు.”ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన కొంతమంది యువకులను నాకు అప్పగిస్తే ఈ దేశం స్వరూ పాన్నే మార్చేస్తాను” అని స్వామీజీ తరచూ అనేవారు.మన దేశంలో యువత మనసులో స్ఫూర్తి నింపినవారిలో వివేకానంద అంతటి వారు మరొకరు లేరు. అందుకే మన దేశంలో ఆయన పుట్టినరోజు జనవరి 12 ను “నేషనల్ యూత్ డే” గా జరుపు కుంటారు. ఆయన తన ప్రసంగా లతో, సూక్తులతో పుస్తకాలతో, యువతరాన్ని ఉత్తేజపరిచి, దిశానిర్ధేశం చేశారు.వ్యక్తి విజయవంతమైన జీవితం గడపడానికి కొన్ని సూత్రాలను వివేకానందుడు పేర్కొన్నారు. ఆధ్యాత్మిక భావనలతో వ్యక్తిలో నిస్వార్థమైన వైఖరులు ఏర్పడ తాయని వివరించారు.సుఖదు:ఖాలు నాణేనికి రెండు పార్శ్వాలు లాంటివి. కాబట్టి సానుకూల దృక్పథంతో ఉండాలి. కష్టాలు వచ్చినప్పుడు ఏడుస్తూ కూర్చుంటే సమయం వృథా అవుతుందే తప్ప ప్రయోజనం ఉండదు. విశ్వంలో ప్రతి అంశం తార్కిక ఆలోచనలతో ముడిపడి ఉంటుంది. కాబట్టి తార్కిక ఆలోచ నలతో ప్రపంచాన్ని అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాలి. ఎవరి సామర్థ్యంపై వారికి నమ్మకం ఉండాలి. ఇతరులపై ఆధారపడే విధానానికి స్వస్తి పలకాలి.మందలో ఉండకు ..వందలో ఉండటానికి ప్రయత్నించు..ప్రయత్నం చేసి ఓడిపో కానీ ప్రయత్నం చేయడంలో మాత్రం ఓడిపోకు. కెరటం నాకు ఆదర్శం... లేచి పడుతున్నందుకు కాదు పడినా కూడా లేస్తున్నందుకు.మతం అనేది సిద్దాంత రాద్ధాంతాలలో లేదు...

అది ఆచరణలో ఆద్యాత్మికులుగా పరిణతి చెంద డంలో మాత్రమే ఉంది. ఈ ప్రపంచం బలవంతులకు మాత్రమే సహాయ పడుతుంది.. ఇలా యువతకు వివేకానందుడు స్ఫూర్తిని కలిగించే ప్రయత్నం చేశారు. జీవితం నిరాశ నిస్పృ హలతో నిండిపోయి నప్పుడు, భయ భ్రాంతులకు గురైనపుడు, మనసు చెడు మార్గాలవైపు మళ్ళి ఏమి చెయ్యాలో దిక్కు తోచని పరిస్థితులలో ఉన్నపుడు స్వామి వివేకానందకు సంబందించిన పుస్తకాలు, సూక్తులను చదవాలి. వివేకానందుడి సందేశాలు సూటిగా మన హృదయాన్ని తాకుతాయి.

మనసులో ఒక తెలియని ధైర్యం, ఆలోచనలో మార్పు కలుగుతుంది. జీవితానికి అసలైన అర్థం తెలు స్తుంది. నిద్రాణమై ఉన్న భారత జాతిని మేల్కొలిపిన ఆ మహ నీయుడు, యుగ పురుషుడు ఎప్పటికి మన గుండెల్లో నిలిచే ఉంటారు.

## ప్రధమ చికిత్స వైద్యుల స్వచ్ఛంద సేవా సంఘం ఎన్జీవో ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్షల శిబిరం




**జగిత్యాల, తెలంగాణ సేన న్యూస్:**

జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం కీచులాటపల్లి గ్రామంలో ప్రధమ చికిత్స వైద్యుల స్వచ్ఛంద సేవా సంఘం ఎన్జీవో ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ రాచకొండ ఆనంద్ సహకారంతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య పరీక్షల శిబిరంకు విశేష స్పందన లభించింది. గ్రామంలో దాదాపు వంద (100) మందికి పైగా డయాబెటిక్ మరియు బిపి పరీక్షలను నిర్వహించి పరీక్షలలో పాజిటివ్ వచ్చిన వారిని సంబంధిత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య సెంటర్ కు రెఫర్ చేశారు. పరీక్షలకు అనుగుణంగా సంబంధిత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ సలహాతో మందులు వాడాలని సూచించారు.డయాబెటిక్, బిపి పలు అసంక్రమిక వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధమ చికిత్స వైద్యులు, ప్రథమ చికిత్స వైద్యుల స్వచ్ఛంద సేవా సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు సిరిమల్లె మల్లేశం, జాతీయ అధ్యక్షులు సయ్యద్ నిజాముద్దీన్, జాతీయ ప్రధాన కార్యదర్శి మంద వేణుగోపాల్ గౌడ్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం.మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## అరాచకాలు ఆపకుంటే అంతు చూస్తాం

**- కాంగ్రెస్ ఎమ్మెల్యేకు మావోయిస్టుల వార్నింగ్!**




**జడ్చర్ల, తెలంగాణ సేన న్యూస్ :**
జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డిని మావోయిస్టులు టార్గెట్ చేశారు. ఆయన స్వగ్రామంలో మావోయిస్టుల పేరిట లేఖను అంటించడం సంచలనంగా మారింది. ఎమ్మెల్యే బలవంతంగా పేదల భూములు లాక్కుంటున్నారని మావోయిస్టులు ఆ లేఖలో పేర్కొన్నారు.బాలానగర్, రాజాపూర్ తదితర ప్రాంతాల్లో ఉన్న కంపెనీల నిర్వాహకులను ఎమ్మెల్యే, ఆయన అనుచరులు బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

ఇంకా యజమానులను బెదిరించి పట్టాభూములను లాక్కున్నాడని ఆరోపించారు. గతంలో గుడిలో విగ్రాహలు దొంగిలించి ఎక్కడ అమ్మావో మాకు తెలుసన్నారు. ఇకపై ఇలాంటిది తమ దృష్టికి వస్తే వదిలిపెట్టేది లేదని వార్నింగ్ ఇచ్చారు. లచ్చన్నదళం పేరిట ఈ లేఖ స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఈ లేఖపై విచారణ జరుపున్నారు.

**స్పందించని ఎమ్మెల్యే..**

అయితే ఈ లేఖపై ఎమ్మెల్యే ఇంత వరకు స్పందించలేదు. పోలీసులు సైతం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఎమ్మెల్యేను టార్గెట్ చేస్తూ మావోయిస్టల నుంచి లేఖ రావడంపై స్థానిక కాంగ్రెస్ నేతల్లో టెన్షన్ మొదలైంది. ఎమ్మెల్యేపై మావోయిస్టులు భూఆక్రమణలు, వసూళ్లు తదితర సీరియస్ ఆరోపణలు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ అంశాలపై ఎమ్మెల్యే రియాక్షన్ ఎలా ఉ ంటుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. కాంగ్రెస రాష్ట్ర నాయకత్వం, సీనియర్ నేతలు సైతం ఈ అంశంపై ఎలా రెస్పాండ్ అవుతారన్న దానిపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పొలిటికల్ సర్కిల్స్ లో తీవ్రంగా చర్చ సాగుతోంది.

## సినీ నటుడు అనిల్ మొగిలి ఆధ్వర్యంలో కొండగట్టులో ప్రత్యేక పూజలు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం అలీ రాజుపేట గ్రామానికి చెందిన యువ సినీ నటుడు అనిల్ మొగిలి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసి సీరియల్ ఫేమ్ నవీన్ గౌతమ్, హెబ్బా పటేల్ ముఖ్య తారగానంగా, సిద్దిపేట జిల్లా గద్దెలపల్లి గ్రామానికి చెందిన దర్శకులు మురళి వర్ధన్ జి, దర్శకత్వంలో చిత్రీకరణ జరుపుకోబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ విజయవంతం కావాలని, సంబంధించిన స్క్రిప్ట్ కు సంబంధించి పూజా కార్యక్రమం కొండగట్టులో జరిగింది అని అన్నారు ఈ వెబ్ సిరీస్ చిత్రీకరణ రెగ్యులర్ షూటింగ్ మార్చ్ నుండి ప్రారంభం కానుంది అని తెలిపారు

# వర్గీకరణకు తెలంగాణ జర్నలిస్టు యూనియన్ సంపూర్ణ మద్దతు

**-వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి టీజేయు డప్పులు అందజేత**
**-టీజేయు రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు**
**-జర్నలిస్టు సంఘాలను అభినందించిన మందకృష్ణ మాదిగ**

**హైదరాబాద్, 11 జనవరి 2025 :**




వేల గొంతులు లక్ష డప్పులు ఫిబ్రవరి 7 న జరిగే కార్యక్రమానికి తెలంగాణ జర్నలిస్టు యూనియన్ సంపూర్ణ మద్దతు తెలుపుతూ సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హాజరు అయ్యారు. ఫిబ్రవరి 7న జరిగే వేల గొంతులు లక్ష డప్పుల కార్యక్రమానికి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ నుంచి సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ డబ్బులు మందకృష్ణ మాదిగ కు బహూకరించారు. అనంతరం టీజీయూ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాద్ రావు మాట్లాడుతూ 30 సంవత్సరాల నుంచి జరిగే పోరాటంలో అప్పటినుండి ఇప్పటివరకు మందకృష్ణ చేసే పోరాటానికి వెంబడి తెలంగాణ జర్నలిస్టు యూనియన్ ఉందని కప్పర ప్రసాద్ రావు అన్నారు. ఇప్పటికైనా సుప్రీంకోర్టులో ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ చేసే పోరాటానికి తెలంగాణ జర్నలిస్టు యూనియన్ వెంబడి ఉంటూ ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేయటం కోసం మేము సైతం కార్యక్రమంలో పాల్గొంటామని సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఐ.ఎఫ్ డబ్ల్యూ.జె. జాతీయ ఉ పాధ్యక్షులు పెద్దాపురం నరసింహ, మాదిగ జర్నలిస్ట్ ఫోరం జాతీయ అధ్యక్షులు మాతంగి దాస్, జాతీయ నాయకులు లక్ష్మణ్ , ఎండబ్ల్యూ జె అధ్యక్షులు అశోక్ , మాదిగ జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షులు గాదె రమేష్, టీజేయు రాష్ట్ర ఉపాధ్యక్షులు కే బాబురావు, కార్యదర్శి కనకా రెడ్డి, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు డి అశోక్, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మరాఠీ కృష్ణమూర్తి, మెదక్ జిల్లా అధ్యక్షులు రామయ్య, సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ చారి, నాయకులు సాగర్, సత్యం, బాలచంద్రం, నాగరాజు, శ్రీను, శేఖర్, మహేష్, ఎల్లం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మహనీయులు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకం అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో

**మహబూబాబాద్, టౌన్ తెలంగాణ సేన జనవరి.11**




మహనీయులు వడ్డే ఓబన్న జీవితం స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో అన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వడ్డే ఓబన్న జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా వడ్డే ఓబన్న నిర్వహించిన పాత్ర, ఆయన జీవిత,చరిత్రను,జిల్లా,వెనుకబడి తరగతుల అధికారి చదివి వినిపించారు.అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడైన వడ్డే ఓబన్న జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం సంతోషంగా ఉందని, ఆయన అందించిన స్ఫూర్తిని అందరూ స్మరిం చుకోవాలన్నారు. తొలితరం స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న చరిత్ర చిరస్మరణీయమని, ఆయన జీవితం అందరికీ ఆదర్శమని, ఆయన విలువలు, సూచనలు పాటిస్తూ మెరుగైన సమాజ నిర్మాణం,కోసం,కృషి,చేయాలన్నారు. మహనీయులు చేసిన గొప్ప పనులను స్మరిం చుకోవడం వల్ల వారు అందించిన స్ఫూర్తి, విలువలు తెలుస్తాయని అన్నారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ప్రధాన సహచరుడిగా బ్రిటిష్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా చేసిన పోరాటంలో ఆయన పోషించిన పాత్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. స్వార్థ ప్రయోజనాలతో బ్రతికే సమాజంలో ఆనాటి కాలంలోనే ఆయన నిస్వార్థంగా మంచి విలువలను పాటిస్తూ దేశం కోసం పోరాటం చేశారని అన్నారు. ఓబన్న నిరంతరం కష్టపడే తత్వంతో జీవితాంతం చెడుపై పోరాటం చేస్తూ గడిపారని ఆయన చేసిన సేవలను గుర్తు చేసు కోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి నరసింహస్వామి, జెడ్పీ సీ ఈ ఓ పురుషోత్తం, మైనారిటీ సంక్షేమ అధికారి శ్రీనివాసరావు వడ్డెర సంఘం జిల్లా నాయకులు, గుంజే హనుమంతు, కాంగ్రెస్ పార్టీ ఓబీసీ రాష్ట్ర నాయకులు, పింట్రాల రాందాస్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, పలువురు బీసీ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులను నమ్మించి మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ

**-కల్లబొల్లి మాటలతో అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్**
**-అంబేడ్కర్ ఇచ్చిన హక్కులను కాలరాస్తుంది కాంగ్రెస్ పార్టీ**
**-ఆశ పడితే గోస పడతాం అన్న కేసీఆర్ మాట నిజమైంది.**
**-స్థానిక ఎన్నిల లబ్ధి కోసమే రైతు భరోస ప్రకటన- అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**

**టేక్మాల్, జనవరి 11:**



ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని, స్వయంగా ఆరు గ్యారంటీలను ప్రకటించిన రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల మాటలు నీటి ముటల వలె తేలిపోయాయని అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతులకు ఎకరానికి రూ. 10వేల రైతు బంధు ఇవ్వగా, తాము ఎకరానికి రూ. 15వేలు ఇస్తామని మాయ మాటలతో రైతులను మబ్యపెట్టి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రూ. 15వేలకు బదులుగా రూ 12వేలు ఇస్తామని రైతన్నకు వెన్నుపోటు పొడిచిన వైఖరిని నిరసిస్తూ టేక్మాల్ మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం రైతులు పెద్ద ఎత్తున టేక్మాల్లో నిరసన ర్యాలీ నిర్వహించారు అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని ఇచ్చి తమ నిరసనను తెలిపారు. ఈ సందర్భంగా క్రాంతికిరణ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్పై రాసి ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ విఫలమైందన్నారు మాయ మాటలు చెప్పిన వారు ఇప్పుడు ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. రూ. 2లక్షల రుణమాఫీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ చెప్తున్నప్పటికిని ఇప్పటికి చాలా గ్రామాల్లో రుణమాఫీ కాలేనివారు చాలా మంది ఉన్నారని, అందులో అనవసరంగా కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి మోసపోయామని కాంగ్రెస్ కార్యకర్తలే బాధపడుతున్నారని తెలిపారు. కేసీఆర్ సార్ ఇచ్చిన రైతు బందు వస్తలేదని, కేసీఆర్ కిట్టు వస్తలేదని, కల్యాణ లక్ష్మి తులం బంగారం వస్తలేదన్నారు. ఈ వర్షకాలం వరి ధాన్యం కొనుగోలులో సగానికిపైగా దాన్యం దళారుల పాలైందన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో ప్రభుత్వంపై నమ్మకం లేని రైతులు దళారులను ఆశ్రయించి ధాన్యాన్ని అమ్ముకున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో 24గంటలు వ్యవసాయానికి కరెంటు ఇస్తే ఇప్పుడు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందన్నారు. కేసీఆర్ సార్ చెప్పినట్లు ఆశ పడితే గోస పడతాం అనే విషయం నిజమైందన్నారు. ఇప్పుడు ఇస్తామంటున్న రైతు భరోసా కూడా కేవలం స్థానికల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిన ప్రకటన తప్ప రైతుల శ్రేయస్సు కోసం చేసిందికాదన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ప్రజలకు ఇచ్చిన హక్కులను కాలరాస్తున్న కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పుడు కూడా మోసపోతే మరో నాలుగేళ్లపాటు ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తుందన్నారు.

## ఇట్టగోని విగ్నేష్ కుమార్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు



జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న ఇట్టగోని వెంకటేష్ - శంకరమ్మ దంపతుల తనయుడు విగ్నేష్ కుమార్ ి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. ఇలాంటి జన్మదిన వేడుకలు, మరెన్నో జరుపుకోవాలని, నిండు నూరేళ్లు, ఆనందంగా జీవించాలని, జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండాలని కోరుకుంటూ, చెల్లి: సాయి శృతి మరియు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వే త్వరలో పూర్తి



**అమీర్ పేట్, తెలంగాణ సేన న్యూస్ :**
అమీరుపేట్ డివిజన్లో ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా, అతి త్వరలో సర్వే పూర్తయినట్లు కాంగ్రెస్ మహిళా డివిజన్ ప్రెసిడెంట్ రాజేశ్వరి తెలిపారు.సనత్ నగర్ కాంగ్రెస్ ఇంచార్జి డాక్టర్ కోట నీలిమ ఆదేశాల మేరకు వారి ప్రోత్సాహం, సహకారం, దిశానిర్దేశం మరువలేనిదని ఈ సందర్భంగా రాజేశ్వరి పేర్కొన్నారు. ఈ సర్వేలో ప్రజాపాలన కమిటీ ఇంచార్జి రజినీకాంత్, డివిజన్ యూత్ జనరల్ సెక్రెటరీ ముత్తు మరియు కాంగ్రెస్ నాయకులు ఆండాలు పద్మావతి, దేవి, సుకన్య, పరావుద్దీన్ శోభ, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## పార్టీకి పూర్వ వైభవం తేవాలి

**- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి**
**- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి**



పార్టీకి పూర్వ వైభవం తేవాలనిస్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు.శనివారం గణపురం మండలంలోని చెల్పూర్ లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలని అన్నారు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన సంవత్సర కాలంలో అన్ని వర్గాల వారికి అన్యాయం జరుగుతుందని, రైతులకు, రైతుబందు ఇవ్వడం లేదని, రుణమాఫీ చేయక రైతులను నట్టేట ముంచారని అలాగే ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని, విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేసే పరిస్థితి లేదని, ఏ ఎన్నికలు జరిగిన బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల తర్వాత గెలిచిన పార్టీకి ఒక సంవత్సరం సమయం ఇవ్వాలని ఇన్ని రోజులు ఓపికతో ఉ న్నానని , ఇకపై నన్ను నమ్ముకున్న వాళ్లపై కేసులు పెడితే సహించేది లేదని, కార్యకర్తలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.నాయకులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో అంటూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని అన్నారు. ఏ సమస్య ఉన్నా నా దృష్టికి తీసుకురావాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మోతే కర్నాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ నడిపెల్లి మధుసూదన్ రావు, మాజీ ఎంపీటీసీ చెన్నూరి రమాదేవి మధుకర్, మాజీ మర్కెట్ ఛైర్మన్ పొలుసాని లక్ష్మీ నరసింహా రావు, మాజీ సొసైటీ ఛైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి, చెల్పూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు అల్లూరి శ్రీనివాస్, మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు మేకల రజిత, మాజీ ఉప సర్పంచ్ రజియా, నాయకులు దాసరి రవి, అరె సాంబరెడ్డి, రాందాస్ రాజు, హన్మంతరావు, చీటి శంకర్, పొన్నం రమేష్, విజయ, మోకిరాల తిరుపతి రావు, తోట శ్రీనివాస్, పిరాల దేవేందర్ రావు, రాజయ్య, నవీన్ రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస రావు, ఆంజద్, దొగ్గేల సుధాకర్, యూత్ నాయకులు, చీటి కృష్ణ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శిశు సంక్షేమంలో ఆదర్శంగా తెలంగాణ

-పోషకాహార తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ప్రత్యేక పథకాలు
-కేంద్ర ప్రాయోజిత పథకాల్లో కేంద్ర ప్రభుత్వ వాటా పెరగాలి
-పెరిగిన ధరలకు అనుగుణంగా కేంద్ర భాగస్వామ్యం పెంచాలి
-బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడిలకు గుడ్డును దూరం చేశారు
-పోషకాహారం అందించే దిశలో కేంద్ర బడ్జెట్ పెరగాలి
-ఉదయపూర్ చింతన్ శివిర్ లో స్పష్టం చేసిన మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
-సీతక్క ప్రసంగానికి ప్రశంసలు
-శ్రద్ధగా విన్న కేంద్ర పెద్దలు, పలు రాష్ట్రాల మంత్రులు, అధికారులు
-మంత్రి సీతక్క ప్రసంగానికి చివర్లో చప్పట్లతో సమర్థన



రాజస్థాన్/ ఉదయపూర్, తెలంగాణ సేన న్యూస్

రాజస్థాన్ రాష్ట్రంలో ని ఉదయపూర్ పట్టణంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన చింతన్ శివిర్ లో మంత్రి సీతక్క ప్రసంగించారు. కేంద్ర మహిళా సి సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితోపాటు, అన్ని రాష్ట్రాల మహిళా సి సంక్షేమ శాఖ మంత్రులు అధికారులు హాజరైన ఈ సదస్సుకు మహిళా శి సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ కాంతి వెస్లీ లతో కలిసి మంత్రి సీతక్క హాజరయ్యారు. మహిళా శిశు సంక్షేమం కోసం తెలంగాణలో అమలవుతున్న ప్రత్యేక పథకాలు, సాధించిన పురోగతి, కేంద్రం నుంచి ఆశిస్తున్న సహకారం పై మంత్రి సీతక్క మాట్లాడారు. చిన్నారుల, గర్భిణులు బాలింతలకు పోషకాహారం అందించడంలో అంగన్వాడి కేంద్రాలు పోషిస్తున్న పాత్రను వివరించారు. ఆదివాసి బిడ్డగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఆకలికి మించిన శత్రువు లేదన్న జాతిపిత మాహాత్మ గాంధీ స్ఫూర్తితో.. తెలంగాణలో ప్రత్యేకంగా ఆరోగ్యలక్ష్మి అనే పథకం ద్వారా గర్భిణీలు, బాలింతలకు ప్రతిరోజు 200 ఎంఎల్ పాలతో పాటు అదనపు గుడ్డును అందిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ఏటా రూ. 296 కోట్ల ను ఖర్చు చేస్తున్నట్లు మంత్రి సీతక్క చెప్పారు. అంగన్వాడి చిన్నారులకు సైతం పాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. బాలామృతం ప్లస్ ద్వారా పోషకాహార లోపం ఉన్న పిల్లలకు, ప్రత్యేక పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా నివేదిక ప్రకారం సరైన పోషకాహారం అందకపోవటంతో దేశంలో 30 శాతానికి పైగా ఐదేళ్ల లోపు చిన్నారులు ఎదుగుదల లోపంతో బాధపడుతున్నారని, మహిళలు రక్తహీనతతో సమస్యలను ఎదుర్కొంటున్నారని మంత్రి సీతక్క గుర్తు చేశారు. కేంద్రం రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పోరాడితే తప్ప ఈ సమస్యలను రూపుమాపలేమని పేర్కొన్నారు. అయితే పోషకాలు అధికంగా ఉన్న కోడిగుడ్లను బిజెపి పాలిత రాష్ట్రాల్లో అంగన్వాడి కేంద్రాల్లో పంపిణీ చేయడం లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు కోడిగుడ్లను ఇచ్చేందుకు సంస్కృత కారణాలు అడ్డుగా ఉంటే, కోడిగుడ్డు స్థానంలో అధిక పోషకాలు ఉండే ఇతర ప్రత్యామ్నాయ పదార్థాలను అందివ్వాలని, అనుగుణంగా కేంద్రం నుంచి బడ్జెట్ కేటాయింపులు పెంచాలని కోరారు. చిన్నారులు, పిల్లలు దేశ వనరులని, వారికి బంగారు భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్న పండిత్ జవహర్లాల్ నెహ్రూ వ్యాఖ్యలను గుర్తు చేశారు. తెలంగాణలో 35,700 అంగన్వాడి కేంద్రాలను నడుపుతున్నట్లు తెలిపిన మంత్రి సీతక్క, జాతీయ విద్యా విధానం, 2020 కి అనుగుణంగా అంగన్వాడి కేంద్రాల్లో అహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు అంగన్వాడి కేంద్రాలకు ఫర్నిచర్, ఆట వస్తువులను సరఫరా చేయటంతో పాటు రంగురంగుల పెయింటింగ్స్ తో అంగన్వాడి కేంద్రాలను తీర్చిదిద్దినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా స్వయం సహాయక బృందాల మహిళలచే అంగన్వాడి చిన్నారులకు రంగురంగుల యూనిఫామ్ దుస్తులను ఉచితంగా అందజేసినట్లు పేర్కొన్నారు. తెలంగాణలో మహిళా సాధికారత కోసం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి విజయాలను మంత్రి వివరించారు. మహిళా సంఘాలను పారిశ్రామిక శక్తులుగా తీసినందుకు వారిచే సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆర్టీసీ బస్సులను, క్యాంటీన్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం పాఠశాల విద్యార్థులకు మహిళా సంఘాల ద్వారా లక్షల సంఖ్యలో యూనిఫామ్ లను కుట్టించి సరఫరా చేసినట్లు తెలిపారు. దేశంలోనే అత్యధికంగా అంగన్వాడి సిబ్బందికి వేతనాలు అందిస్తున్న ది తెలంగాణ ప్రభుత్వమని మంత్రి సీతక్క గుర్తు చేశారు. అయితే పెరిగిన ధరలు, జీఎస్టీ అమలు తర్వాత రాష్ట్రాలకు తగ్గిన ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం తన వాటాను పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్రం తన వాటాగా అంగన్వాడీ టీచర్లు, అంగన్వాడి హెల్పర్ల గౌరవేతనాలను రూ. 10 వేలు, రూ. 7 వేలకు పెంచాలని కోరారు. తెలంగాణ తరహాలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లకు పదవీ విరమణ ప్రయోజనాలను కల్పించాలని సూచించారు. తెలంగాణలో మహిళా సంక్షేమం కోసం 15.26 లక్షల మంది విడోలకి , 1.41 లక్షల ఒంటరి మహిళలకు నెలకు రూ. 2000 పెన్షన్ను అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అయితే విడోలకి ఇస్తున్న పెన్షన్ లో కేంద్రం తన వాటాగా 200 రూపాయలు మాత్రమే ఇస్తోందని, గత పది ఏళ్లుగా ఈ మొత్తం పెరగలేదని గుర్తు చేసిన మంత్రి సీతక్క, పెరిగిన ధరలు అవసరాలకు అనుగుణంగా పెన్షన్ మొత్తం పెంచాలని కోరారు. మిషన్ వాత్సల్య కింద ..ప్రభుత్వ పిల్లల సంరక్షణ సంస్థలన్నిటిని జిల్లాస్థాయిలో బాల రక్ష భవన్స్ పేరుతో ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చినట్టు తెలిపారు. తద్వారా ఎలాంటి సమన్వయ సమస్యలు లేకుండా పిల్లలకి సంపూర్ణ సేవలందిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో 33 జిల్లాల్లో 39 బాల రక్షక్ వాహనాలను అందుబాటులోకి తెచ్చామని, అవసరం ఉన్న పిల్లల వద్దకు చేరుకొని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. హైదరాబాద్ నుండి శిశు విహార్ ద్వారా ఆరేండ్ల లోపు పిల్లల దత్తత ప్రక్రియను ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొన్న విషయాన్ని మంత్రి సీతక్క ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు ఉన్న చిన్నారుల కోసం చేపట్టిన చర్యలు, స్పెషల్ హోం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పెట్రోల్ బంక్, స్పెషల్ హోమ్ పిల్లల కోసం 6 వేల చదరపు గజాల్లో నిర్వహిస్తున్న క్రీడా ప్రాంగణాలు, జువెనైల్ పిల్లల కోసం నైపుణ్య శిక్షణ కార్యక్రమాల వివరాలను మంత్రి సీతక్క వివరించారు. మిషన్ శక్తి కింద అత్యాచార, ఫోక్ షో బాధితుల కోసం తెలంగాణలో పోలీసుల సహకారంతో 35 భరోసా సెంటర్లను నిర్వహిస్తున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు. లైంగిక దాడులు అత్యాచార బాధితులకు గ్రీన్ చాలా ద్వారా పరిహారాన్ని అందిస్తున్నామన్నారు. తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అనాథ పిల్లల కోసం దుర్గాబాయి దేశ్ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణ సంస్థ ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు, ప్రతి ఏటా 240 మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తామని, అందులో 70 శాతం సీట్లను అనాథలకు రిజర్వ్ చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. ద్విచక్ర, ద్విచక్ర వాహనాల డ్రైవింగ్ లో మహిళల కోసం శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు, అందులో ఇప్పటికే 8 మంది ట్రాన్స్ జెండర్ లతో పాటు మొత్తం 950 మంది మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు వెల్లడించారు. పని ప్రాంతాల్లో జరిగే లైంగిక వేధింపుల కేసులను సత్రం పరిష్కరించేందుకు ఎనిమిది లేబర్ కోర్టులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దేశంలోనే తొలిసారిగా ట్రాన్స్ జెండర్ లను ట్రాఫిక్ కానిస్టేబుల్ గా నియమించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. ట్రాన్స్ జెండర్ ల కోసం ప్రతి జిల్లా కేంద్రంలో ఒక మైత్రి క్లినిక్ ను ఏర్పాటు చేయడం దేశంలోనే తొలిసారి అని గుర్తు చేశారు. వికలాంగుల ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేకంగా జాబు పోర్టల్ ను అందుబాటులోకి తెచ్చినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. తెలంగాణ చరిత్రలో మొట్టమొదటిసారిగా వికలాంగుల పరికరాల కోసం 50 కోట్లను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఇలా తెలంగాణలో మహిళా శిశు సంక్షేమం కోసం అమలవుతున్న ప్రత్యేక పథకాలను మంత్రి సీతక్క వివరించడంతో పాటు, కేంద్ర సౌజన్యంతో అమలయ్యే పథకాల్లో కేంద్రం తన వాటాను పెంచాలని మంత్రి సీతక్క లెక్కలతో సహా వివరించారు. చివరగా అన్నార్తులు, అనాథలు, ఆకలి బాధ లేని సమాజాన్ని ప్రసాదించాలన్న సంత్ కబీర్ సూక్తితో, దాశరథిపత్యంతో తన ప్రసంగాన్ని మంత్రి సీతక్క ముగించారు. అయితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే సీతక్క ప్రసంగం భిన్నంగా సాగటంతో అంతా ప్రశంసించారు. సీతక్క ప్రసంగాన్ని శ్రద్ధగా విన్న ఇతర రాష్ట్రాల మంత్రులు అధికారులు, చప్పట్లతో తమ సంఘీభావం తెలిపారు. మిజోరాం మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి లాల్రిన్ పుయి తమ సంప్రదాయ కండువాను సీతక్కకు బహూకరించి అభినందనలు తెలియజేశారు.

## క్రీడారంగంలో గ్రామీణ క్రీడాకారులు తమ ప్రతిభను చాటాలి




నల్గొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన క్రీడాకారులకు గ్రామంలోని నిమ్మనగోటి బ్రదర్స్ క్రీడా దుస్తులను గ్రామానికి చెందిన నోముల సుధీర్ జ్ఞాపకార్థంగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మనగొట్టి బ్రదర్స్ పరమేష్,వెంకట్ నాగార్జున,నరేష్ లు మాట్లాడుతూ గ్రామంలోని క్రీడాకారులు జిల్లా,రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించే విధంగా నిరంతరం సాధన చేయాలని క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. గ్రామీణ క్రీడాకారులు తమ యొక్క ప్రతిభను వెలికి తీసి ఉన్నంత స్థానంలో రాణించాలని క్రీడలతోని శారీరక మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మాతృ శ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.



ఈరోజు జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని మాతృ శ్రీ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహేందర్ రెడ్డి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. విద్యార్థుల భవిష్యత్తు గురుంచి ఆలోచన చేస్తూ అనునిత్యం విద్యార్థుల శ్రేయస్సే, తన కర్తవ్యంగా భావించి ఉత్తమమైన విద్యార్థులు గా తీర్చిదిద్దుతు, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని, నిండు, నూరేళ్లు ఆనందంగా జీవించాలని, మనస్ఫూర్తిగా, కోరుకుంటూ, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, బంధుమిత్రులు, స్నేహితులు, కళాశాల విద్యార్థులు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. బాలు టీవీ కేబుల్ ఛానల్ తరఫున ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు...

## బాలు టీవీ కేబుల్ ఛానల్ క్యాలెండర్ ఆవిష్కరించిన పిఎస్ఆర్ న్యాయ కళాశాల విద్యార్థులు



కాకినాడ జిల్లా బాలు టీవీ కేబుల్ ఛానల్ క్యాలెండర్ ని కాకినాడ జిల్లాలోని పీఎస్ఆర్ న్యాయ కళాశాల విద్యార్థులు శుక్రవారం రోజున ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా న్యాయ విద్యార్థులు మాట్లాడుతూ బాలు టీవీ కేబుల్ ఛానల్ కి నూతన సంవత్సర, మరియు భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బాలు టీవీ కేబుల్ ఛానల్ ప్రజల సమస్యలను, ఎప్పటికప్పుడు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఆ సమస్యలు, పరిష్కారం దిశగా బాలు టీవీ కేబుల్ ఛానల్ పనిచేయాలని కోరారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బాలు, శ్రీ మహాలక్ష్మి, వెంకట్రావు, బాబ్జి, సీతారాం, స్వప్న, యజ్ఞ చంద్రిక, వంశి, నందు తదితరులు పాల్గొన్నారు.

## లయన్ అమర్నాథ్ రావును సన్మానించిన టీచర్ సత్యనారాయణ

సిద్దిపేట జిల్లా గజ్వేల్ లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ ఆధ్వర్యంలో 2025 2026 సంవత్సరానికి డిస్ట్రిక్ట్ గవర్నర్ గా కాబోతున్న లయన్ అమర్నాథ్ రావుని శనివారం లయన్స్ క్లబ్ మాజీ ప్రెసిడెంట్, ఉపాధ్యాయ నాయకుడు,టీచర్ సత్యనారాయణ మరియు లయన్స్ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీచర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తితో తమ జీవితాన్ని ప్రారంభించి కృషి పట్టుదల నిరంతరం సమాజ సేవలో పాల్గొంటూ మా ఉపాధ్యాయ వర్గం నుండి లయన్ డిస్ట్రిక్ట్ చరిత్రలో మొట్ట మొదటిసారిగా డిస్టిక్ గవర్నర్ కాబోతున్న అమర్నాథ్ రావుకి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగిందని, ఈ విజయం ఉపాధ్యాయ సమాజానికి గర్వకారణం అని హర్షం వ్యక్తం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ గోలి సంతోష్, జోన్ చైర్మన్ నేతి శ్రీనివాస్ గుప్తా, లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షుడు మల్లేశం గౌడ్, కోశాధికారి దొంతుల సత్యనారాయణ, లయన్స్ ప్రతినిధులు రాంప్రసాద్ రావు, నరసింహారావు, శ్రీధర్, పరమేశ్వర చారి,గుడాల రాధాకృష్ణ, సత్యనారాయణ, సత్తయ్య, శ్రీనివాస్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## స్వయంకృషి ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో మందబుద్ధి గల మహిళలకు సంక్రాంతి పండుగ వేడుకలు

- ముఖ్యఅతిథిగా తెలంగాణ సాంస్కృతి శాఖ చైర్మన్ గుమ్మడి వెన్నెల
- స్వయంకృషి ఫౌండర్ మంజుల కళ్యాణ్




,సికింద్రాబాద్, తెలంగాణ సేన జనవరి, 11:

సికింద్రాబాద్ చెందిన స్వయంకృషి ఎన్జీవో మంజుల కళ్యాణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వివిధ రాష్ట్రాలలో ఏ విధంగా పండుగను నిర్వహించుకుంటారో మందబుద్ధి గల మహిళలకు తెలిసే విధంగా ఎన్జీవో సంస్థ ఫౌండర్ , డైరెక్టర్ మంజుల కళ్యాణ్ స్వయంగా మహిళలకు దగ్గరుండి నేర్పించి చేసే విధంగా కృషి చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాంస్కృతి శాఖ చైర్మన్ గుమ్మడి వెన్నెల హాజరై మంద బుద్ధి కల మహిళలతో కలిసి ఈ సంక్రాంతి పండుగను జరుపుకునే విధానాన్ని దగ్గర ఉండి స్వయంగా చూపించారు. అనంతరం గుమ్మడి వెన్నెల మాట్లాడుతూ స్వయంకృషి ఎన్జీవో సంస్థ డైరెక్టర్ మంజుల కళ్యాణ్ చేస్తున్న సేవలను ఆమె అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడానికి ఎంతో పెద్ద మనసుతో ఈ మహిళలకు ఈ పండుగ వాతావరణాన్ని కల్పించిన మంజుల కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మంద బుద్ధి గల మహిళలు ఉత్సాహంగా, ఆనందంగా, కేరింతలతో సంక్రాంతి పండుగ చేసుకునే విధానాన్ని తెలుసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన మంజుల కళ్యాణి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన మందబుద్ధి గల మహిళలు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి ఎన్జీవో సెక్రటరీ , గ్రూప్ కెప్టెన్ సురేష్ , అధ్యక్షులు జయరాం రెడ్డి, కమిటీ మెంబర్స్ పాల్గొన్నారు.

## బిజెపి మేకల కీర్తి హర్ష కిరణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి ముగ్గుల పోటీలు



సికింద్రాబాద్, తెలంగాణ సేన జనవరి, 11:

సికింద్రాబాద్ సీతాఫల్మండి డివిజన్ లో బీదల బస్తీలో మేకల కీర్తీహర్షకిరణ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలోభాగంగా మహిళలకు ఘనంగా ముగ్గుల పోటీలను నిర్వహించరు . మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని రంగురంగుల ముగ్గులను వేశారు. దాదపుగా 100 మంది మహిళలు ఈ పోటీలలో పాల్గొన్నారు . పోటీలో పాల్గొన్న ముగ్గురిని విజేతలు గా ఎంపిక చెసి వారితో పాటు పోటీలో పాల్గొన్న అందరికీ బహుమతులను నిర్వహకులు మేకల కీర్తి హర్షకిరణ్ అందించారు . ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలసారంగపాణి, రాచవల్ల కృష్ణమూర్తి, కనకట్ల హరి, డివిజన్ మాజీ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, భాస్కర్ గిరి, బిజెపి డివిజన్ అధ్యక్షులు ఇవి నరేష్ , అనిత, అనూష, నాగమల్లేశ్వరి, కళావతి, నాగరాణి, సతీష్ ముదిరాజ్, ముఠా గణేష్, రాజేష్ ముదిరాజ్, సింహాచలం బాబు, శైలజ, సరిత, మేరీ, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు. కనుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమం లో మహిళలూ ఎంతగానో ఆనందించారు.

## కంటోన్మెంట్ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యం : కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ




కంటోన్మెంట్ ,తెలంగాణ సేన న్యూస్ 11:

సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధి భారతీయ జనతాపార్టీ తోనే సాధ్యమవుతుందని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ జన్యావుల రామకృష్ణ అన్నారు. శనివారం కంటోన్మెంట్ మహేంద్ర హిల్స్ లోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ....తనపై నమ్మకం ఉంచి మరోసారి నామినేటెడ్ మెంబర్ గా అవకాశం కల్పించినందుకు ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్ , అమిత్ షా , కిషన్ రెడ్డి, బండి సంజయ్, మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ గారితో పాటు మహంకాళి సికింద్రాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు బూర్గుల శ్యాంసుందర్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. కంటోన్మెంట్ లో తాను చేసిన అభివృద్ధి పనులను, తీసుకువచ్చిన సంస్కరణల గురించి ఈ సందర్భంగా తెలియచేశారు. అలాగే అతి త్వరలో కంటోన్మెంట్ లో 300 ల కోట్ల రూపాయలతో వివిధ పనులు చేపడతామని వెల్లడించారు. దీంతో పాటు అమృత్ పథకాన్ని కంటోన్మెంట్ లో ప్రవేశ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను నెరవేర్చేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని చెప్పారు. దీంతోపాటు కంటోన్మెంట్ ప్రజలకు తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ విషయంపై త్వరలో ప్రణాళికలను సిద్ధం చేసి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కానున్నట్లు చెప్పారు.

## గొల్ల కురుమలు ఆర్థిక రాజకీయ ఉద్యోగ రంగాల్లో ఎదగాలి

**- నెల్లికుదురు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు.**

**-శనివారం రోజున జీఎంపీఎస్ 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ.**

మహబూబాద్ రూరల్ నెల్లి కుదురు మండలం తెలంగాణ సేన జనవరి 11




గొల్ల కురుమలు ఆర్థికంగా రాజకీయ, ఉద్యోగ రంగాలలో ముందుండాలని నెల్లికుదురు సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు అన్నారు. నెల్లికుదురు మండల కేంద్రం లో పోలీస్ స్టేషన్ లో గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) 2025 నూతన సంవత్సర క్యాలెండర్ను సబ్ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ఎస్సై రమేష్ బాబు, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లం అశోక్ లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గొల్ల కురుమలు ఆర్థికంగా ఎదిగేందుకు గొల్ల కురుమలు ఉద్యోగ వ్యాపార రంగాలతోపాటు రాజకీయంగా కూడా చాలా వెనుకబడి ఉన్నారని...రానున్న రోజుల్లో గొల్ల కురుమలు అన్ని రంగాలతో పాటు రాజకీయ, ఉద్యోగ రంగాల్లో కూడాఎదగాలని వారు ఆకాంక్షించారు. గొల్ల కురుమలు చట్టాల పైన సరైన అవగాహన పెంచుకోవాలని వారు కోరారు. గొల్ల గ్రూపులో కొంత చదువు తక్కువగా ఉందని అందరూ ఉన్నంత చదువులను అభ్యసించేలా తల్లిదండ్రులు తగు చర్యలు తీసుకోవాలని వారి సందర్భంగా కోరారు. చట్టాల మీద సరైన అవగాహన లేకపోవడం వల్ల అనేక కేసులలో గొల్ల కురుమలు ఇరుక్కుని ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ దుబార్ల సాయిలు జిల్లా ఉపాధ్యక్షులు కొమ్మన బోయిన యాకయ్య జిల్లా సహాయ కార్యదర్శి మంచాల హరీష్, మాజీ తొర్రూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కసినబోయిన విజయ్ యాదవ్ ,మండల అధ్యక్షులు ఆకుల రాజు, మండల కార్యదర్శి కొమ్మనబోయిన వెంకన్న, నెల్లికుదురు గ్రామ సొసైటీ అధ్యక్షులు మంచాల వెంకన్న, మునగలవిడు సొసైటీ అధ్యక్షులు దేశబోయిన ఎల్లయ్య, కవటి యకయ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ మల్లప్పగారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి సహిత కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేసి నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ :సంతోషాలతో ఎల్లప్పుడు ఉండాలని స్వామిని కోరిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి గారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు హరి నాథ్ రెడ్డి, జాంగా రెడ్డి, విక్రమ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, 130 డివిజన్ అధ్యక్షులు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, పద్మ రావు, కొలన్ జీవన్ రెడ్డి, జితేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాజు చారీ మరియు తదితరులు పాల్గొన్నారు.

## సినీ నటుడు అనిల్ మొగిలి ఆధ్వర్యంలో కొండగట్టులో ప్రత్యేక పూజలు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం అలీ రాజుపేట గ్రామానికి చెందిన యువ సినీ నటుడు అనిల్ మొగిలి కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసి సీరియల్ ఫేమ్ నవీన్ గౌతమ్, హెబ్బా పటేల్ ముఖ్య తారాగానంగా, సిద్దిపేట జిల్లా గద్దెలపల్లి గ్రామానికి చెందిన దర్శకులు మురళి వర్ధన్ జి, దర్శకత్వంలో చిత్రీకరణ జరుపుకోబోతున్న సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ విజయవంతం కావాలని, సంబంధించిన స్క్రిప్ట్ కు సంబంధించి పూజా కార్యక్రమం కొండగట్టులో జరిగింది అని అన్నారు ఈ వెబ్ సిరీస్ చిత్రీకరణ రెగ్యులర్ షూటింగ్ మార్చ్ నుండి ప్రారంభం కానుంది అని తెలిపారు

## త్రిఫ్ట్ ఫండ్ ప్రారంభిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు...




చండూరు., జనవరి-11, తెలంగాణ సేన న్యూస్:

చేనేత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని త్రిఫ్ట్ ఫండ్ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నందుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు అని చండూరు చేనేత సహకార సంఘం ప్రధాన కార్యదర్శి కర్నాటి శ్రీనివాసులు అన్నారు. శనివారం సహకార సంఘం లో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. చేనేత భరోసా కింద కార్మికులకు సంవత్సరానికి 24,000 ఇవ్వనున్నట్లు తెలిపారు, అలాగే జీవిత బీమా కింద వయసుతో ప్రమేయం లేకుండా జియో ట్యాగ్ కలిగిన కార్మికుడు మృతి చెందితే 5లక్షలు ప్రభుత్వం చెల్లించనున్నట్లు వివరించారు. అనంతరం కార్మికులంతా కలిసి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రాపోలు లక్ష్మయ్య, కోశాధికారి రావిరాల ఓంకారం, డైరెక్టర్ చిట్టిపోలు వెంకటేశం,మేనేజర్ తిరందాసు బిక్షమయ్య, కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేశం, చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు చెరుపల్లి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, జూలూరు వెంకటేశం, బొల్ల జనార్ధన్, సంగెపు శ్రీను, సంగెపు మల్లేశం, చిట్టిపోల్ అంజయ్య, చెరుపల్లి రాఘవేంద్ర, తిరందాసు ఆంజనేయులు, చెరుపల్లి నరేష్, దుస్స గణేష్, తిరందాసు నందు, గంజి వెంకటేశం, చెరుపల్లి రఘు, గుర్రం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## హైందవ సోదరుల ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం ఏర్పాటు



సిద్దిపేట జిల్లా గజ్వేల్ కోర్టు వద్ద మెయిన్ రోడ్డులో శనివారం హైందవ సోదరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా నిర్వహించి, లాల్ బహదూర్ శాస్త్రి వర్ధంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి,మాజీ ఎఫ్ డీ సీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి,నరేష్ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ భాస్కర్ మాట్లాడుతూ భారతదేశ మాజీ ఉప ప్రధాని స్వర్గీయ లాల్ బహదూర్ శాస్త్రి చిరస్మరణీయుడని వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని హైందవ సోదరుల ఆధ్వర్యంలో లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ ,కో ఆప్షన్ సభ్యులు, లాయర్లు , డాక్టర్లు,వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు,హైందవ సోదరులు,యువకులు తదితరులు పాల్గొన్నారు

## నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే పెద్ది




నెక్కొండ మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సంగని సూరయ్య నూతన సంవత్సరం సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ క్యాలెండర్ల ను ముద్రించగా ఈరోజు నల్లబెల్లి లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నివాసం లో వారి చేతుల మీదుగా నూతన సంవత్సర క్యాలెండర్ల ను ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమం లో నర్సంపేట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు నెక్కొండ మండల మాజీ జెడ్పిటిసి మాజీ ఎంపీటీసీలు మాజీ సర్పంచులు మండల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం



నేడు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నడిగూడెం గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల విద్యుత్ అధికారి సైదయ్య శనివారం తెలిపారు. నడిగూడెం సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి నడిగూడెం టౌన్ ఫీడర్ 11%ెజ శ్రీఱఅవ% కు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే కార్యక్రమం ఉన్నందున అంతరాయం ఏర్పడుతుందని. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సిరికొండ మండల ప్రజలకు ఎస్సై పలు సూచనలు



సంక్రాంతి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో సెలవుల్లో ఊరికి వెళ్తున్న వారికి సిరికొండ ఎస్సై ఎల్. రామ్ పలు సూచనలు చేశారు ట్రావెల్ చేస్తున్న విషయాలను సోషల్ మీడియాలో పెట్టకుండా ఉండాలని, ఇంటి లోపల బయట సీసీ కెమెరాలు అమర్చిపోవాలని విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులను జాగ్రత్తగా ఉంచుకోవాలని ,ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు ఊర్లలో సంచరిస్తే వెంటనే పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయాలని

# కంటోన్మెంట్ ప్రజల సేవకై బిజెపి కృషి..

**-కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జె. రామకృష్ణ ....**

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 11:

భారతీయ జనతా పార్టీ సిద్ధాంతం గల పార్టీ అని పనిచేసే ప్రతి వ్యక్తికి గుర్తింపును ఇస్తుందని కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ జె రామకృష్ణ అన్నారు. శనివారం మహేంద్ర హిల్స్ లోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కంటోన్మెంట్ బోర్డ్ 8 వార్డుల బిజెపి అధ్యక్షుల పేర్లను ప్రకటించారు. అదేవిధంగా మోండా డివిజన్ బిజెపి నూతన అధ్యక్షుని పేరును వెల్లడించారు .

వార్డు 1 – జైపాల్ రాకేష్,
వార్డు 2 – మందుల శ్రావణ్ ,
వార్డు 3– ఐతా అరుణ్,
వార్డు 4 – సచిన్ ఖంకే,
వార్డు 5 – బల్దా సంతోష్ కుమార్,
వార్డు 6 – ప్రతీక్ లోధా ,
వార్డు 7 – %ఎ.ఓ%. పవన్ కుమార్,



వార్డు 8 – పింజర ప్రవీణ్,
మోండా డివిజన్ అధ్యక్షులుగా బన్సిలాల్ జితేంద్ర కుమార్ పేర్లను ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షులుగా ప్రకటించిన నేపథ్యంలో అధ్యక్షులందరికీ శాలువాలు కప్పి అభినందించారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు ,పూర్వ అధ్యక్షులు, సీనియర్ నాయకులు విజయానంద్ ,బిఎన్ శ్రీను,సతీష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న రంగోలీలు..

కంటోన్మెంట్, తెలంగాణ సేన న్యూస్ 11:



సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రెజిమెంటల్ బజార్ లోని సెయింట్ ప్యాట్రిక్స్ పాఠశాలలో నిర్వహించిన రంగోలీ లు పలువురిని ఆకట్టుకున్నాయి. విభిన్నమైన రంగులతో సంక్రాంతి పండుగ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా వేసిన ముగ్గులు ముచ్చట గొలిపాయి. ఈ పోటీలను కరస్పాండెంట్ ఫాదర్ డి .రవి శేఖర్, ప్రిన్సిపల్ ఫాదర్ ఏ. ఇలాంగోలు ప్రారంభించారు. తమ పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు, సంస్కృతి, సాంప్రదాయాలు వాటి ఔన్నత్యాన్ని, వైభవాన్ని తెలియచెప్పేలా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు తెలిపారు. పంటల పండుగగా పిలుచుకునే సంక్రాంతి పండగ సందర్భంగా రైతుల త్యాగాలను వారు విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎండి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## చిట్కుల మహిపాల్ రెడ్డికి ఘన సన్మానం



సిద్దిపేట జిల్లా గజ్వేల్ లో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ లో పాల్గొనడానికి వచ్చిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిట్కుల మైపాల్ రెడ్డిని మార్గమధ్యలో మైలారం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించిన మైనార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇక్బాల్,ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా వైస్ ప్రెసిడెంట్ అనిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి అనూప్, ఉప్పల ప్రవీణ్,దిరజ్ రెడ్డి, జాని పాషా రాజిరెడ్డి పల్లి రాజు,నూరజ్,సమీర్, మహేశ్వర్, అలి,తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్దే ప్రభుత్వాల ధ్యేయం

**-ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**-ముఖ్య అతిథిగా అదిలాబాద్ ఎంపీ ఎడం నగేష్ హాజరు**




గ్రామాల అభివృద్దే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శనివారం ఉట్నూర్ మండలంలోని సాలెగూడ గ్రామంలో 275 లక్షలతో వ్యయంతో నిర్మించనున్న టీడబ్ల్యూపిఎస్ హాస్టల్ భవన నిర్మాణ పనులకు ఎంపీ గోడం నగేష్ తో కలసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. గ్రామాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి అటవీ క్లియరెన్స్ ఇప్పించేలా కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్ ను కోరారు. పీఎం జన్మన్ పథకంలో మంజూరైన రోడ్లు అటవీ సమస్యల కారణంగా రద్దవుతున్నాయని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూలంగా అనేక సమస్యలు తలెత్తుతున్నాయని దీనికి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఆదివాసి తెగలలో అత్యంత వెనుక బడిన పీవీటిజీ గ్రామాల్లో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించి ఫారెస్ట్ క్లియరెన్స్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. పెంబి మండల కేంద్రంలో ఏకలవ్య పాఠశాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆదివాసీలకు మెరుగైన విద్యా, వైద్యాన్ని అందించేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడానికి తమ ప్రభుత్వం ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ సెలవుల సమయంలో పిల్లలపై ఓ కన్నేసి ఉంచండి

**-ప్రమాదలను నివారించండి**

**ఎస్ఐ మహేందర్**




నెక్కొండ మండలంలోని ప్రజలకు ఎస్ఐ మహేందర్ ఒక ప్రకటన చేయడం జరిగింది. పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎంత పనిలో ఉన్నా సరే పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలని పిల్లల పట్ల అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని అయన అన్నారు. పిల్లలను బావుల్లో, చెరువుల్లో ఈత కొట్టేందుకు పంపించొద్దని, ఈత నేర్పించాల్సిన అవసరమైతే తామే స్వయంగా వారికి తోడుగా వెళ్లలని అన్నారు. మైనర్ లను బైక్ నడపమని చెప్పొద్దు. పిల్లలకు బైక్ తాళాలు కనిపించకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. మొబైల్ ఫోన్లు, ట్యాబ్‌లు వారికి ఇవ్వొద్దు. ఇవ్వాల్సిన అవసరం అయితే మీ కనుచూపు మేరలోనే ఉండే విధంగా ఏర్పాటు చేయాలి. ప్రత్యేక గదిలో ఒంటరిగా ఉండడం వల్ల అనర్థాలకు దారి తీస్తుంది. స్నేహితులతో కలిసి దూరప్రాంతాలకు పంపకండి. ఇంట్లో పెద్దలతో పిల్లలు ఎక్కువ సమయం గడిపేలా చూడాలి. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచుకుని మన సంస్కృతి, సంప్రదాయాలను నేర్పించాలి. కాలిగా ఉంచకుండా పిల్లలకు ఆసక్తి గల ఆంశాలపై (డ్యాన్సు, సంగీతం) అవసరమైన శిక్షణ ఇప్పించాలి తల్లిదండ్రులు తమ పిల్లలని రేపటి పౌరులుగా తీర్చిదిద్దాలని ఎస్ఐ మహేందర్ మండలంలోని ప్రజలకు తెలియజేయడం జరిగింది.